


TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 5 జూలై 2026 | వెల : 4/-




## మధ్యవర్తిత్వంలో పాకిస్థాన్‌తో పోలిక

- చైనా జర్నలిస్టుకు భారత రాయబారి గట్టి కౌంటర్
- పశ్చిమాసియా మధ్యవర్తిత్వంపై పాక్‌తో పోలికను తిరస్కరించిన భారత్
- రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలను చూస్తేనే తేడా తెలుస్తుందన్న రాయబారి
- ఆ పోలిక అన్యాయమని చైనాలో స్పష్టం చేసిన విక్రమ్ దొరైస్వామి

# మనది ప్రజాపాలన

- కేసీఆర్‌ది దొంగలా పాలన
- కేసీఆర్‌కు 1000 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?
- రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు
- ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది
- రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు.
- ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైంది
- మిడ్జిల్‌లో సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞత సభ
- జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా విజయానికి సహకరించిన వారికి సీఎం కృతజ్ఞతలు



మిడ్జిల్

ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూ ల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణం లో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహ బూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన - మిగతా3లో



# ఐటీ కారిడార్స్‌లో కొత్త ట్రెండ్

- మాఫియా నైట్స్ గేమ్‌తో కేఫ్‌లు ఫుల్
- హైదరాబాద్ ఐటీ హబ్‌లో విస్తరిస్తున్న నయా గేమ్ ట్రెండ్
- వీకెండ్స్‌లో ఆటకు కేరాఫ్‌గా నిలుస్తున్న కేఫ్‌లు
- ఆన్‌లైన్‌లోనూ ఆడేందుకు యాప్‌లు
- బెంగళూరులో బుక్ మై షో ద్వారా టికెట్లు
- హైదరాబాద్‌లో మాఫియా నైట్ గేమ్

హైదరాబాద్

మహానగరాల్లోని ఉద్యోగులు తమ ఒత్తిడి నుంచి బయటపడటానికి జిమ్, యోగాలు మాత్రమే కాకుండా వినోదంపైనా దృష్టి సారిస్తున్నారు. ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్‌ను సృష్టిస్తూ, ఐదు రోజులు పడిన శ్రమను వీకెండ్‌లో మర్చిపోయేలా వినూత్న రీతిలో ఎంజాయ్ చేస్తున్నారు. - మిగతా3లో



## ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

- ఓట్లు, సీట్లు, విరాళాల దొంగతనంలో నిమగ్నమైంది: జైరాం రమేశ్
- బీజేపీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ తీవ్ర విమర్శలు
- దేశంలో 'ఓటు చోరీ, సీట్ చోరీ, డొనేషన్ చోరీ' జరుగుతోందని ఆరోపణ
- రాజకీయ పక్షపాతంతో పనిచేస్తోంది
- ప్రస్తుతం దేశంలో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం తీవ్రంగా క్షీణించింది

## తీవ్ర వేడికి భగభగమంటున్న అమెరికా..

- 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారీ వేడుకలకు సిద్ధమైన అమెరికా
- విపరీతమైన వేడి కారణంగా వేడుకలు రద్దు
- తీవ్రంగా ప్రభావితమవుతున్న విద్యుత్ వ్యవస్థ




# గ్లోబల్ చిప్ హబ్‌గా భారత్



- మేక్ ఇన్ ఇండియా తదుపరి దశ సెమీకండక్టర్లే
- గుజరాత్ సనంద్‌లో సీజీ సెమీ ఓఎస్ఏటీ ప్లాంట్ ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- భారత్‌లోనే పూర్తి ఎలక్ట్రానిక్స్ వాల్యూ చైన్ నిర్మిస్తామని ప్రకటన
- గ్లోబల్ చిప్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దుతామని కీలక వ్యాఖ్యలు

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు తేదీలు ఖరారు

- అర్థవంతమైన చర్చలు జరుగుతాయని కేంద్రం ఆశాభావం
- జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- 25 రోజుల వ్యవధిలో మొత్తం 19 రోజులపాటు ఉభయసభల సమావేశాలు
- ప్రభుత్వ సిఫార్సుకు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



## అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- ప్రజలపై భారం పడకుండా చూశాం: మోదీ
- రాజస్థాన్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ ప్రారంభం
- రూ.1.06 లక్షల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- సంక్షోభ సమయంలో 40కి పైగా దేశాల నుంచి ఇంధన దిగుమతులు
- ప్రజలపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ సుంకం తగ్గింపు

3లో

# 125 పని దినాలు 60 సెలవులు

- 15 రోజుల్లోనే వేతనాలు
- వీబీ జీరాంజీ గురించి ఇవి తెలుసుకోండి
- రాష్ట్రంలో వీబీ జీ రాం జీకి ప్రభుత్వం పచ్చజెండా
- సీఎం అధ్యక్షతన రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ ఏర్పాటు
- ఈ నెల ఒకటి నుంచే అమలు చేస్తున్నట్లు తెలిపిన ప్రభుత్వం
- వీబీ జీరాంజీ తెలంగాణలో అమలు



హైదరాబాద్

ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రాం జీ తెలంగాణలోనూ అమలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవాళ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పథకం నిబంధనల ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరం లో కనీసం 100 రోజులు ఉండే పని దినాలు, 125కు పెరగను న్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచే ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు పరచినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. అమలు కోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ ఏర్పాటవుతుంది. - మిగతా3లో



## 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

- యూఏపీఏ కింద ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం
- వీరిలో 17 మంది పాక్ పౌరులు, ఆరుగురు భారతీయులు
- జాబితాలో జైష్, లష్కరే తోయిబా కీలక నేతలు
- ఉగ్రదాడులు, చొరబాట్లు, నిధుల సమీకరణ, నియామకాల ఆరోపణలు
- సుంజ్వాన్, నాగ్రోటా దాడులతో సంబంధాలున్నట్లు వెల్లడి

# పార్టీ పేరు మార్చుకోండి

- కవితకు ఈసీ లేఖ
- పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..
- ఘాటుగా స్పందించిన కవిత
- 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన
- కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక
- కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదన్న కవిత



హైదరాబాద్

కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన తెలం గాణ రక్షణ సేన(టీఆర్ఎస్) పార్టీ పేరుపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందినట్లు ఈసీ తెలిపింది. దీంతో ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని కోరింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం కవితకు లేఖ రాసింది. ఈసీ లేఖకు తెలంగాణ రక్షణ సేన సమాధా నాలు పంపింది. కేవలం రెండు అభ్యంతరాలను మాత్రమే - మిగతా3లో

# అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

చురుకైన విధానాలు, విభిన్న ఇంధన వనరులు, బలమైన దౌత్య సంబంధాల ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాల్లో ఒకదానిని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. సరైన సమయంలో తీసుకున్న నిర్ణయాలతో దేశ ప్రజలపై కనీస భారం పడేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రిఫైనరీ కాంప్లెక్స్‌ను పరిశీలించిన ఆయన, రిమోట్ బటన్ నొక్కి ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభాల్లో ఒకటి ఏర్పడిందని ప్రధాని పేర్కొన్నారు. అనేక దేశాలు ఇంధన కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని చెప్పారు. అయితే భారత్ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సరైన వ్యూహంతో ముందుకెళ్లిందని తెలిపారు.

**రూ.75 వేల కోట్లకు పైగా నష్టాలను!**

సంక్షోభానికి ముందు భారత్ సుమారు 25 నుంచి 26 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేదని మోదీ చెప్పారు. పరిస్థితులు మారిన తర్వాత దిగుమతుల కోసం 40కి పైగా దేశాలతో సంబంధాలను విస్తరించినట్లు తెలిపారు. భారత దౌత్య బలాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ఇంధన సంక్షోభం నుంచి దేశాన్ని బయటపడేశామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం వల్ల ఏప్రిల్ నుంచి జూన్ మధ్య చమురు సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాలను ఎదుర్కొన్నాయని ప్రధాని వెల్లడించారు. అయినప్పటికీ ఆ భారాన్ని పూర్తిగా ప్రజలపై మోపకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. లీటర్‌పై రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి సామాన్యులపై అదనపు భారం పడకుండా చూశామని వివరించారు. ఇంధన సంక్షోభ సమయంలో భారత్ విఫలమవుతుందని కొందరు భావించారని మోదీ విమర్శించారు. దేశంలో అనేక రకాల వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పారు. భారత్ విఫలమవుతుందని అంచనాలు వేసిన వారు ఇప్పుడు నిరాశలో ఉన్నారని



వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం కలిగిన దేశంగా భారత్ అవతరించిందని ప్రధాని తెలిపారు. ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళ్తోందని చెప్పారు. స్వాభిమానం నిలవాలంటే వ్యక్తి అయినా, దేశమైనా స్వావలంబన సాధించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

**ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తుందని!**


పచ్‌పద్రలో ప్రారంభించిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్ దేశ ఇంధన రంగంలో చారిత్రక మైలురాయి అని ప్రధాని అభివర్ణించారు. రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన తొలి రిఫైనరీ కూడా ఇదేనని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లలో ఒకటిగా ఇది నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పశ్చిమ రాజస్థాన్ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రాజస్థాన్ స్వావలంబన సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యేవని ప్రధాని విమర్శించారు. శిలాఫలకాలు వేసిన తర్వాత ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచేవారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాల పనితీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో బాధ్యత ముగిసిందని భావించకుండా వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తామని తెలిపారు. ఇటీవల రిఫైనరీ ప్రాజెక్టు ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని ప్రస్తావించిన ప్రధాని, ఆ తర్వాత మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసిన కార్మికులు, అధికారులను అభినందించారు. ఎంత పెద్ద సవాలు ఎదురైనా నవభారత్ తన సంకల్పం నుంచి వెనక్కి తగ్గదని వారు నిరూపించారని ప్రశంసించారు. పచ్‌పద్ర కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పెట్రోకెమికల్స్, పట్టణ రవాణా, రైల్వేలు, జాతీయ రహదారులు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ పంపిణీ తదితర రంగాలకు ఈ ప్రాజెక్టులు సంబంధించినవి. వీటిలో రూ.13 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న జైపూర్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-2 కీలకంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రాజస్థాన్ అభివృద్ధికి కొత్త ప్రాజెక్టులు మరింత వేగాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

**సుమారు రూ.480 కోట్ల వ్యయంతో**

అంతకుముందు జోధ్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించారు. సుమారు రూ.480 కోట్ల వ్యయంతో ఈ టెర్మినల్‌ను నిర్మించారు. 23 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనం ద్వారా ఏడాదికి 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించవచ్చు. రాజస్థాన్ సంప్రదాయ కళాకృతులు, ఆధునిక సదుపాయాల మేళవింపుగా టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. దీనివల్ల మార్వార్ ప్రాంతంలో పర్యటకం, వాణిజ్యం, ఉపాధికి కొత్త అవకాశాలు లభిస్తాయని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ వాయు మార్గాల అనుసంధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు 'సవరించిన ఉడాన్ పథకాన్ని' కూడా ప్రధాని ప్రారంభించారు. రాబోయే పదేళ్ల కోసం ఈ పథకం కింద రూ.28,840 కోట్లను కేటాయించారు. కొత్తగా 100 ఎయిర్‌డ్రోమ్‌లు, 200 హెలిప్యాడ్‌లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజస్థాన్ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 54 వేల మందికి నియామక పత్రాలు అందించినట్లు ప్రధాని తెలిపారు. వారికి అభినందనలు తెలియజేశారు. రాజస్థాన్ ప్రజలకు తాను రుణపడి ఉన్నానని పేర్కొన్న మోదీ.. ఆ రాష్ట్రంలోని ప్రతి అణువు స్వాభిమానం ప్రాధాన్యాన్ని నేర్పిందని చెప్పారు. స్వావలంబనతోనే స్వాభిమానాన్ని నిలబెట్టుకోవచ్చని, కొత్త ప్రాజెక్టులతో రాజస్థాన్‌తో పాటు దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు తేదీలు ఖరారు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు ఉభయసభల సమావేశాలు నిర్వహించనున్నారు. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 రోజులపాటు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ ఉభయసభల సమావేశాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఆ విషయాన్ని వెల్లడించారు. వర్షాకాల సమావేశాల తేదీలను కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. జులై 20న ప్రారంభమయ్యే సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, సంభాషణలు, నిర్ణయాలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి పార్లమెంట్ సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. బంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మారిన రాజకీయ సమీకరణాల ప్రభావం ఉభయసభల కార్యకలాపాలపై కనిపించే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు సైతం వర్షాకాల సమావేశాల్లో చర్చనీయాంశంగా మారనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని కోరుతూ 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబీటీ) ఎంపీలు చేసిన విజ్ఞప్తులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు రాజ్యసభలోనూ రాజకీయ సమీకరణాలు మారాయి. కొత్తగా



ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అధికార ఎన్డీయేకు సంఖ్యాబలం మరింత అనుకూలంగా మారింది. రాజ్యసభకు చెందిన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలతో ఎగువ సభలో బీజేపీ మరింత బలం పెంచుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.


ఈసారి వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ జూలై 17న సమావేశమై తన నివేదికను ఆమోదించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం నివేదికను పార్లమెంట్ పరిశీలనకు సమర్పించనున్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు అరెస్టై వరుసగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుంచి స్వయంచాలకంగా తొలగించాలనే ప్రతిపాదన ఈ బిల్లులో ఉన్నట్లు సమాచారం. ఈ నిబంధనపై ఇప్పటికే తీవ్ర రాజకీయ చర్చ జరుగుతోంది.

ప్రజాప్రతినిధులు, ఉన్నత పదవుల్లో ఉన్నవారి జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఈ నిబంధన ఉపయోగపడుతుందని బిల్లుకు మద్దతు ఇస్తున్నవారు చెబుతున్నారు. అయితే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దీనిని ఉపయోగించుకునే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను అరెస్టు చేయడం ద్వారా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో వివాదాస్పద నిబంధనను పూర్తిగా తొలగించే అవకాశం లేదని తెలుస్తోంది. అయితే రాజకీయ కక్ష సాధింపు చర్యలు, ఉద్దేశపూర్వక కేసుల నుంచి రక్షణ కల్పించేలా కొన్ని భద్రతా చర్యలను జేపీసీ తన నివేదికలో సూచించే అవకాశం ఉన్నట్లు సమాచారం. జులై 17న జరిగే సమావేశంలో నివేదికకు తుది రూపం ఇచ్చి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల్లో ఎదురైన పరిణామాల నేపథ్యంలో అధికార ఎన్డీయే ఈసారి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపునకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు గత సమావేశాల్లో దిగువ సభలో ఆమోదం పొందలేదు. దీంతో బిల్లులో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే విధంగా 50 శాతం పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం కీలకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైనికుల ప్రాణనష్టానికి సంబంధించిన అంశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌ను వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షం ప్రస్తావించే అవకాశం ఉంది.

# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

పాకిస్థాన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్-ఎ-మహ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా (ఎల్ఈటీ)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది. ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది. ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా



ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హరూన్ రషీద్ గనాయ్ తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది. 2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## గ్లోబల్ చిప్ హబ్‌గా భారత్

భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. గుజరాత్‌లోని సనంద్‌లో ఏర్పాటు చేసిన జ+ సెమీ అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ ప్లాంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెమీ కండక్టర్ రంగం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో తదుపరి దశ (నెక్స్ట్ ఫేజ్) అని పేర్కొన్నారు. దేశంలో పూర్తి ఎలక్ట్రానిక్స్ వాల్యూ చైన్‌ను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ గుజరాత్ ప్లాంట్‌లో ప్రతి ఏడాది 20 కోట్ల చిప్‌ల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సంస్థ త్వరలోనే చేరుకుంటుందనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. 'సెమికాన్ ఇండియా కార్యక్రమం వేగంగా ముందుకు సాగుతోంది. స్టెప్ బై స్టెప్.. బ్రిక్ బై బ్రిక్.. ఇప్పుడు చిప్ బై చిప్‌గా భారత్ ముందుకు సాగుతోంది. దేశంలో ఏడాదికి 50 కోట్ల చిప్‌ల ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా త్వరలోనే సాధిస్తామని నమ్ముతున్నాను' అని మోదీ అన్నారు.

**ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్**

ఈ సందర్భంగా గత పదేళ్లలో ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రధాని వివరించారు. ప్రపంచంలోనే భారత్ ఇప్పుడు రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా నిలిచిందన్నారు. మొబైల్ ఎగుమతుల్లో కూడా రెండో స్థానంలో ఉందని, 2014తో పోలిస్తే దేశీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి దాదాపు 7 రెట్లు పెరిగిందన్నారు. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు సుమారు 11 రెట్లు పెరిగినట్లు తెలిపారు.

**ఫినిష్డ్ ప్రొడక్ట్స్ నుంచి సెమీకండక్టర్ల వరకు**

సెమీ కండక్టర్ రంగంలో ఈ అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యపడలేదని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత పదేళ్లుగా ఎలక్ట్రానిక్స్ రంగంలో చేపట్టిన సంస్కరణల ఫలితమే నేటి విజయం అని పేర్కొన్నారు. 'ముందుగా ఫినిష్డ్ ప్రొడక్ట్స్.. తర్వాత కాంపోనెంట్స్.. ఇప్పుడు సెమీకండక్టర్ల దశకు చేరుకున్నాం. అంటే పూర్తి ఎలక్ట్రానిక్స్ వాల్యూ చైన్ భారత్‌లోనే ఏర్పడుతుంది. అది నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. వికసిత్ భారత్ నిర్మాణానికి ఇదే రోడ్ మ్యాప్. ఇదే మేక్ ఇన్ ఇండియా తదుపరి దశ' అని మోదీ అన్నారు. ఐదేళ్ల కిందటే భారత్‌ను ప్రపంచ సెమీ కండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించామని ప్రధాని గుర్తు చేశారు.

**చిప్ ప్యాకేజింగ్ ఉత్పత్తి ప్రారంభం కావడం చరిత్రాత్మక ఘట్టం: మోదీ**

డిజైన్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా మంత్రంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, దేశంలోని మూడో సెమీ కండక్టర్ ప్లాంట్‌లో ఇప్పుడు వాణిజ్య పరంగా చిప్ ప్యాకేజింగ్ ప్రారంభం కావడం కీలక మైలురాయి, చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఈ ప్లాంట్‌కు 2024లో తాను శంకుస్థాపన చేశానని, 2025 ఆగస్టులో టెస్టింగ్ చిప్ పనులు ప్రారంభమయ్యాయని చెప్పిన మోదీ ఇప్పుడు పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని వ్యాఖ్యానించారు. శంకుస్థాపన నుంచి ఉత్పత్తి దశకు చేరుకోవడం వెనుక సంస్థ బృందం, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల కృషి ఎంతో ఉందని వారిని అభినందించారు.

**భారత్- జపాన్- థాయిలాండ్ భాగస్వామ్యానికి నిదర్శనం**

గుజరాత్‌లోని ఈ జ+ సెమీ ప్లాంట్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారత్, జపాన్, థాయిలాండ్ దేశాల పరిశ్రమల మధ్య ఏర్పడిన సాంకేతిక సహకారం, పరస్పర విశ్వాసం, భాగస్వామ్యానికి నిదర్శనం అని అన్నారు. ఈ భాగస్వామ్యం భారత సెమీకండక్టర్ రంగానికి మరింత ఊతం అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక భారత్‌లో సెమీ కండక్టర్ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ఎలక్ట్రానిక్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడం కూడా లక్ష్యంగా ఉంది. ఇంకా దీని ద్వారా గ్లోబల్ చిప్ సప్లై చైన్‌లో భారత్ కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుతుందని భావిస్తున్నారు.

## మధ్యవర్తిత్వంలో పాకిస్థాన్‌తో పోలిక

పశ్చిమాసియా వివాదంలో మధ్యవర్తిత్వానికి సంబంధించి భారత్‌ను పాకిస్థాన్‌తో పోల్చడం సరికాదని, అది అత్యంత అహేతుకమైన పోలిక అని చైనాలోని భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి స్పష్టం చేశారు. ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. శనివారం బీజింగ్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 14వ ప్రపంచ శాంతి ఫోరంలో విక్రమ్ దొరైస్వామి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓ చైనా జర్నలిస్టు, పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల నెలకొన్న తరుణంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తోందని, ఈ విషయంలో భారత్ పాత్ర ఏమిటని ప్రశ్నించారు. దీనికి దొరైస్వామి సూటిగా సమాధానమిచ్చారు. "భారత్‌ను పాకిస్థాన్‌తో పోల్చడం కొంత అన్యాయమైన విషయం. ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలను పరిశీలిస్తేనే మీకు వాస్తవాలు అర్థమవుతాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వ్యవస్థలో ఏ దేశం ఎలాంటి పాత్ర పోషిస్తోందన్న అంశం ఆధారంగానే వాటిని అంచనా వేయాలని సూచించారు. పశ్చిమాసియా వివాదంలో ఇప్పటికే పలు దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయని, ఈ రద్దీలో తాము చేరడం వల్ల ప్రత్యేకంగా ప్రయోజనం ఏమీ ఉండదని దొరైస్వామి అభిప్రాయపడ్డారు. గతంలో భారత్ ఇటువంటి పాత్రలు పోషించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దీనివల్ల ఆశించిన ఫలితంఉండదని స్పష్టం చేశారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్ వంటి అంతర్జాతీయ సంక్షోభాల పరిష్కారంలో చైనా కూడా మధ్యవర్తిత్వానికి చొరవ చూపలేదన్న విషయాన్ని ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. అగ్ర దేశాలు తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు అనుగుణంగానే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటాయని ఆయన వివరించారు.

## ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో "ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం" పేరుతో పాలన సాగుతున్నప్పటికీ, వాస్తవానికి "ఓటు చోరీ, సీటు చోరీ, డొనేషన్ చోరీ" జరుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన "ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తమకు ఉన్న ఆందోళనలను తెలియజేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ పంపినట్లు జైరాం రమేశ్? తెలిపారు. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటోందని ఆయన వ్యాఖ్యానించారు.

"ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి మాకు ఉన్న నిర్దిష్ట ఆందోళనలను ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం లేదు. రాజకీయ పక్షపాతంతో పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం తీవ్రంగా క్షీణించింది. దేశంలో నేడు ఓట్ల దొంగతనం, సీట్ల దొంగతనం జరుగుతున్నాయి. ప్రజలు ఒకప్పుడు ఎన్నికల వ్యవస్థపై ఉంచిన విశ్వాసం ఇప్పుడు దెబ్బతింది. ఎన్నికల ఫలితాలు ముందే నిర్ణయిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది. ఎన్నికల ఫలితాలు ముందే నిర్ణయిస్తే ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటి" దేశ రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థపై దాడి జరుగుతోందని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అంశంపై న్యాయవ్యవస్థ జోక్యం అవసరమని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కూడా జైరాం రమేశ్ లక్ష్యంగా చేసుకుని, ఆయన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తోందని ఆరోపించారు. బంగాల్, బిహార్, మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరు దీనికి నిదర్శనమని అన్నారు. "జ్ఞానేశ్ కుమార్ కపటత్వంతో వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థలా కాకుండా, కేంద్ర హోంమంత్రి, ప్రధానమంత్రి ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది" అని జైరాం విమర్శించారు. అంతేకాకుండా అయోధ్యలోని రామమందిరంలోని విరాళాల వ్యవహారాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అక్కడ కూడా విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ, "ఇది ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం. ఇక్కడ ఓట్ల దొంగతనం, సీట్ల దొంగతనం, విరాళాల దొంగతనం జరుగుతున్నాయి" అని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇతర ఎన్నికల అంశాలపై ఉమ్మడి కార్యాచరణ కోసం ఇండియా కూటమి ఇటీవల సమావేశమైంది. కాంగ్రెస్, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు మొత్తం 23 రాజకీయ పార్టీలు ఈ అంశంపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. అనంతరం తమ ఆందోళనలను వివరిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి సంయుక్త లేఖ పంపాయి. ఈ విషయాన్ని జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

# మనది ప్రజాపాలన

-మొదటిపేజీ తరువాయి

జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. 2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు ఆశీర్వదించడంతో, ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందన్న సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ ప్రయాణం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్?లో రేవంత్ రెడ్డి పర్యటించారు. రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తి సందర్భంగా రేవంత్ కృతజ్ఞత సభ నిర్వహించారు. మిడ్జిల్‌లో కృతజ్ఞత సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా విజయానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



### మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారు

మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనే గొప్ప నాయకుడు ఉండేవారని, హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డేనని, ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డేనని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని, తనది ఈ నియోజకవర్గం కాకపోయినా మిడ్జిల్ ప్రజలు నమ్మకంతో గెలిపించారని, మిడ్జిల్ ప్రజలు తనపై పెట్టిన నమ్మకమే ఇవాళ తనను ఈ స్థాయికి తీసుకెళ్లిందని వివరించారు.

### మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలి

మహబూనగర్ జిల్లాలోని పలు మండలాల్లో 2006లో డార్క్ మండలాలుగా ఉండేవన్న సీఎం తన రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని వెల్లడించారు. మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కోరుతున్నానని పేర్కొన్నారు. ఒకప్పుడు డార్క్ మండలమైన మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలని పిలుపునిచ్చారు.

### ఆంజనేయస్వామిని దర్శించుకున్న రేవంత్ రెడ్డి

ముందుగా ఊర్కొండ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మిడ్జిల్, ఊర్కొండకు చెందిన నేతలు కలిశారు. మహబూబ్ నగర్ జిల్లా నేతలు రేవంత్‌రెడ్డిని సన్మానించారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించిన సీఎం ఊర్కొండలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఊర్కొండలో ఆంజనేయస్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఆలయాన్ని దర్శించుకున్నారు. సీఎం, మంత్రులకు పూజారులు వేదాశ్వీరచనం, ప్రసాదాలు అందజేశారు. రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనుచరులు, నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

### ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి


20 ఏళ్ల క్రితం మిడ్జిల్ జడ్పీటీసీగా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది. జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా తన విజయానికి సహకరించిన వారిని కలిసిన సీఎం మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రేవంత్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు కార్యకర్తలు గుర్తు చేశారు.

"మహబూనగర్ జిల్లాలోని పలు మండలాల్లో 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నా ఉంది. మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కోరుతున్నా. ఒకప్పుడు డార్క్ మండలమైన మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలి"

# ఐటీ కారిడార్స్‌లో కొత్త ట్రెండ్

-మొదటిపేజీ తరువాయి

రొటీన్‌గా పార్టీలు, పబ్‌లు, సినిమాలు, లాంగ్ రైడింగ్‌లను మాత్రమే ఎంచుకోవడం లేదు. మెదడును మరింత ఉత్తేజపరిచే మైండ్ గేమ్స్ వైపు సిటీ ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో ఇటీవల ఈ తరహా మరో కొత్త గేమ్ హవా నడుస్తోంది. మైండ్‌స్పేస్ పరసరాల్లోని ప్రముఖ కేఫ్‌లు, సోషల్ లాంజ్‌ల్లో మాఫియా నైట్ అనే కొత్త ఈవెంట్‌లో యువత జోరుగా పాల్గొంటోంది. ఈ గేమ్‌ను ఆడేందుకు కొందరు అపరిచిత వ్యక్తులు ఓ ప్రదేశంలో కలుసుకుంటారు. ఇందులో భాగంగా మాఫియా, డాక్టర్లు, పోలీసులు, నగరంలోని స్థానిక వ్యక్తులుగా రహస్య పాత్రలను ఎంచుకుంటారు. వాటికి అనుగుణంగా నటన, వ్యూహాత్మక ఆలోచనలు, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తారు. ఈ క్రమంలో ఎవరు నిజాయతీగా వారి పాత్రను పోషిస్తున్నారో కనిపెట్టడానికి ప్రయత్నిస్తారు. ఈ సమయంలో పరస్పరం వాదించుకుంటారు. సరదాగా నిందలు వేసుకుంటారు. ప్రస్తుతం ఈ వినోదానికి యువత బాగా ఆకర్షితమవుతోంది.



### కొత్త స్నేహితుల పరిచయానికి వేదికగా

ఈ మాఫియా నైట్ గేమ్ ఆడాలంటే కనిష్ఠంగా 7గురు కావాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 24 మందితో ఆడొచ్చు. గేమ్ సభ్యుల్లో కచ్చితంగా ఒక డిటెక్టివ్, డాక్టర్, వ్యాఖ్యాత (నరేటర్?)గా వ్యవహరిస్తారు. మిగిలిన వారిలో కొందరు మాఫియా గ్యాంగ్?లా, మరి కొంతమంది నగర ప్రజల పాత్రలు పోషిస్తారు. ఇలా ఒకే రకమైన ఉద్యోగం చేసేవారు ఓ చోట కలిసి, కేవలం నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసమే కాకుండా, కొత్త స్నేహాలు చిగురించడానికి ఇదో చక్కని వేదికగా నిలుస్తోంది.

### మాఫియా గేమ్ ఆడేదెలా

గేమ్ స్టార్ట్ చేయడానికి ముందే ఉన్నవారిలో ఒకరిని వ్యాఖ్యాతగా ఎన్నుకుంటారు. మిగిలిన ఆటగాళ్లకు కార్డు లేదా చీటీ రూపంలో వారి పాత్రలను సీక్రెట్‌గా కేటాయిస్తారు.

మాఫియా - ఈ పాత్ర వహించేవారు రహస్యంగా నగరవాసులను ఒక్కొక్కరిగా గేమ్ నుంచి ఎలిమినేట్ చేస్తారు.

నగర ప్రజలు - తమ మధ్య దాగున్న మాఫియా కిల్లర్స్? ఎవరో కనిపెట్టడమే వీరి లక్ష్యం.

పోలీసులు లేదా డిటెక్టివ్‌లు - వీరు మాఫియాగా భావించిన వ్యక్తి అవునో కాదో నిర్ధారించుకునేందుకు వ్యాఖ్యాతను సైగలతో అడిగి తెలుసుకుంటారు.

డాక్టర్లు - మాఫియా దాడి నుంచి ఇతరులను కాపాడటం వీరి బాధ్యత.

### ఆట సాగే విధానంలో రెండు దశలుంటాయి.

రాత్రి దశ : అందరినీ కళ్లు మూసుకొమ్మంటూ వ్యాఖ్యాత ఆదేశిస్తారు. మాఫియా కళ్లు తెరిచి ఒకరిని చంపుతుంది. అనంతరం డాక్టర్ కూడా కళ్లు తెరిచి ఒకరిని కాపాడతారు. చివరిగా డిటెక్టివ్ ఒకరిని తనిఖీ చేస్తారు.

పగటి దశ : అందరూ కళ్లు తెరిచే ఆడతారు. రాత్రి చనిపోయిందెవరో వ్యాఖ్యాత ప్రకటిస్తారు. గేమ్‌లో ఉండే అందరూ తమలో మాఫియా ఎవరై ఉంటారోనని చర్చించుకుంటారు. అనంతరం ఓటింగ్ ద్వారా ఒకరిని ఎన్నుకొని గేమ్ నుంచి ఎలిమినేట్ చేస్తారు.

చివరిగా సభ్యులందరిలో మాఫియాను కనిపెట్టి ఎలిమినేట్ చేస్తే నగరవాసులు విజయం సాధిస్తారు. ఒకవేళ మాఫియా వ్యక్తులు నగరవాసులతో సమానమైతే మాఫియానే గెలిచినట్లు పరిగణిస్తారు.

### దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా

ఈ మాఫియా గేమ్ కేవలం మన హైదరాబాద్‌లోనే కాదు దేశంలోని ప్రధాన నగరాల్లోనూ ట్రెంట్ అవుతోంది. ప్రధాన ఐటీ హబ్ బెంగళూరులో పెద్ద పెద్ద కేఫ్‌లలో ఈ ఈవెంట్లకు ఆడేందుకు ఏకంగా బుక్ మై షో ద్వారా టికెట్లను బుక్ చేసుకొని పాల్గొనవచ్చు. దేశ రాజధాని దిల్లీలో రాత్రివేళలో స్పెషలిస్ట్ గేమ్ కేఫ్‌లు ఈ ఆటకు ఆతిథ్యం అందిస్తున్నాయి. ముంబయిలోని అంధేరి, జుహూ ప్రాంతాల్లో మాఫియా నైట్స్‌ను గేమింగ్ క్లబ్‌లలో వినూత్నంగా నిర్వహిస్తున్నారు. నేరుగానే కాకుండా మొబైల్‌లో ఆడేందుకు మాఫియా నైట్స్ పేరుతో యాప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

## 125 పని దినాలు - 60 సెలవులు

-మొదటిపేజీ తరువాయి

రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ ఏర్పాటైన తర్వాత గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీనికి ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ఆర్థిక, నీటి పారుదల, అటవీ, పురపాలిక, రెవన్యూ, పశు సంవర్ధక, వ్యవసాయ, విద్య, కార్మిక, ఎస్సీ, ఎస్టీ, మహిళా, శాసనసభ వ్యవహారాల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా సభ్యులుగా ఉంటారు. పంచాయతీరాజ్? కమిషనర్? సభ్యుడు? కార్యదర్శిగా పని చేస్తారు.

### ఆయా స్థాయిల్లో అమలు చేసేందుకు

రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ తమ వార్షిక నివేదికను అసెంబ్లీలో సమర్పించాలి. ఈ మేరకు రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటవుతుంది. దీనికి ప్రధాన కార్యదర్శి లేదా స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదా ఉన్న అధికారి నేతృత్వం వహిస్తారు. ఇది రాష్ట్ర ప్రణాళికను అమలు పరుస్తూ, ప్రభుత్వం అప్పగించే ఇతర కార్యకలాపాలను చేపడుతుంది. జిల్లా స్థాయిలో పథకాన్ని అమలు చేసేందుకు కలెక్టర్ సమన్వయకర్తగా పనిచేస్తారు. జిల్లా, మండల ప్రజా పరిషత్‌లు ఆయా స్థాయిల్లో ప్రణాళికలను అమలు చేస్తాయి.

### ఈ పథకంలో చేరేందుకు అర్హులు వీరే

వీబీ జీరాంజీలో పని చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా ముందుకొచ్చే ప్రతి కుటుంబాన్ని గ్రామ పంచాయతీ నమోదు చేసుకొని, వారికి గ్రామీణ రోజ్?గార్? గ్యారంటీ కార్డులు అందించాలి. ఈ పథకంలో నైపుణ్యం లేని శారీరక శ్రమ కోసం నమోదిత కుటుంబంలోని ప్రతి వయోజన సభ్యునికి అప్లై చేసుకోవడానికి అర్హత ఉంటుంది. వీరికి కనీసం 125 రోజుల పాటు ఒక ఆర్థిక సంవత్సరంలో పని కల్పించాలి. వేతనాలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రకారం చెల్లిస్తారు.

### వీబీ జీరాంజీ పథకంలోని కొన్ని ముఖ్యాంశాలివే :

వారం ప్రాతిపదికన వేతనాల పంపిణీ జరగాలి. లేదంటే పని చేసిన నాటి నుంచి 15వ రోజు లోపు చెల్లించాలి. ఒకవేళ అప్పటికీ చెల్లించకపోతే, 16వ రోజు నుంచి చెల్లించని వేతనంలో 0.05 శాతం చొప్పున ఆలస్యమైన ప్రతి రోజుకూ పరిహారం అందించాలి.

ఉపాధి కోరుతూ ఈ పథకానికి దరఖాస్తు అందించిన 15 రోజుల్లోగా దరఖాస్తుదారునికి పని కల్పించాలి. లేదంటే రోజువారీ నిరుద్యోగ భత్యం పొందేందుకు వారికి అర్హత లభిస్తుంది. పంచాయతీలు పనులను చేపట్టేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. గ్రామసభలు వాటిని ఆమోదించాలి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆ ప్రణాళికలను క్రోడీకరించి, వికసిత్ భారత్? జాతీయ గ్రామీణ మౌలిక సదుపాయాల స్టాక్ పోర్టల్?లో నమోదు చేయాలి. గుర్తింపు లభించిన పనులను కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రాంతాల్లోని వివిధ పథకాల సమన్వయంతో అమలు పరచాలి.

పని చేస్తున్న ప్రదేశంలో అన్ని సదుపాయాలు కల్పించాలి. ఎవరైనా పని చేస్తున్నప్పుడు చనిపోయినా, శాశ్వతంగా వైకల్యం పొందినా వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్?బీవై) కింద అర్హత పరిహారం చెల్లిస్తారు. లేదా కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ఆధారంగా పరిహారం అందిస్తారు. ఎవరైనా పథకానికి సంబంధించిన నిధులను దుర్వినియోగం చేస్తే, రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం వారి నుంచి వసూలు చేయాలి. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు సంస్థాగత యంత్రాంగాలు ఉండాలి. ఆయా స్థానిక పరిస్థితులకు తగినట్లుగా వ్యవసాయ సీజన్? ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 60 రోజుల విరామ సమయాన్ని దృష్టిలో ఉంచుకొని వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేస్తారు. ఈ సమయంలో ఎలాంటి పనులూ చేపట్టరాదు.

## పార్టీ పేరు మార్చుకోండి..

-మొదటిపేజీ తరువాయి

ఈసీ తమకు పంపినట్లు వెల్లడించింది. మిగతా అభ్యంతరాలు చెప్పకుండా ప్రత్యామ్నాయ పేర్లు ఎలా అడుగుతారని టీఆర్ఎస్ ప్రశ్నించింది. పార్టీ పేరు అంశంలో అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేసింది. సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది.



'తెలంగాణ రక్షణ సేన (తెరాసే)' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది.

ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు.

నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో... తమ పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' (తెరాసే) అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు.

అయితే, ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న) ఈ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే 'రాష్ట్ర సేన' కాస్త 'రక్షణ సేన'గా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత కేడర్‌ను సమాయత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు రావడం, ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ 'తెరాసే' పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# హైదరాబాద్‌లో ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం

కాదేదీ నకిలీకి అనర్హం అన్నట్లు కాసుల కక్కుర్తితో కొందరు కేటుగాళ్లు పసిబిడ్డలు తాగే పాల నుంచి తినే అన్నం వరకు ప్రతి దాంట్లో కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అలాంటి కల్తీ ముఠాల ఆగడాలపై హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. 'హెచ్-ఫాస్ట్' పేరుతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం వంద రోజుల్లోనే రికార్డు స్థాయిలో కల్తీ సామ్రాజ్యం పునాదులు కదిలించింది.

### హెచ్‌ఫాస్ట్ పేరుతో ప్రత్యేక బృందం

కొందరు అక్రమార్కులు ఆహార పదార్థాలు కల్తీ చేస్తు యావత్ సమాజంపై నిశ్శబ్ద దాడికి దిగుతున్నారు. ఒకప్పుడు స్వచ్ఛమైన ఆహారంతో నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తే నేడు కల్తీ విషంతో సగటు ఆయుష్షు సగానికి పడిపోతోంది. రసాయనాలు, నాణ్యత లేని పదార్థాలతో జనం ఆరోగ్యంపై చెలగాటం ఆడుతున్నారు. కల్తీఆహారంపై ఉక్కుమోదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో హైదరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. హెచ్ ఫాస్ట్ పేరిట ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కల్తీ పదార్థాలపై కఠిన చర్యలు చేపడుతున్నారు. కల్తీ లేని స్వచ్ఛమైన ఆహారం పొందడం ప్రతి పౌరుడి హక్కు అని టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్తెలిపారు. ఆ హక్కును కాపాడుతూ భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా హెచ్-ఫాస్ట్ నిఘా పనిచేస్తుందని వైభవ్ వెల్లడించారు.

### వంద రోజుల్లోనే రికార్డు స్థాయి దాడులు

టాస్క్ ఫోర్స్ డీసీపీ నేతృత్వంలో 36 మంది సుశిక్షితులైన అధికారులతో పనిచేస్తున్న హెచ్-ఫాస్ట్ క్షేత్రస్థాయిలో కల్తీ రక్కసిని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. వంద రోజుల్లో నగరవ్యాప్తంగా వివిధ జోన్ల పరిధిలో 185 కేసులు నమోదు చేసి, సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది. రాజేంద్రనగర్ జోన్‌లో 55, గోల్కొండ జోన్‌లో 44, సికింద్రబాద్ జోన్‌లో35, చార్మినార్ జోన్‌లో 21, శంషాబాద్ జోన్ 13, జూబ్లీహిల్స్ జోన్‌లో 12, ఖైరతాబాద్ జోన్‌లో 5 ఆహార కల్తీ కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఆయా కేసుల్లో 27వేల 25 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ నకిలీ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. కృత్రిమరసాయనాలతో పండ్లను మగ్గబెట్టే 16 ముఠాల గుట్టురట్టు చేసి 25 వేల 845 కేజీల పండ్లను సీజ్ చేశారు. చికెన్ వ్యర్థాల విక్రయాలకు సంబంధించిన 6 కేసుల్లో ఏకంగా 60 టన్నులకుపైగా చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిల్వ పచ్చళ్లు, కల్తీ కోవా, నకిలీ టీ పొడి, కల్తీ క్రీమ్, కల్తీ నెయ్యి, నాణ్యత లేని డ్రై ఫ్రూట్స్, కల్తీ పెరుగు, కల్తీ పనీర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

### హోటళ్ల నిర్వాహకులకు కఠిన మార్గదర్శకాలు జారీ

ఆహార కల్తీ నివారణ అనేది కేవలం ఒకే విభాగానికి పరిమితమైన అంశం కాదు. అందుకే హెచ్-ఫాస్ట్ విభాగం, జీహెచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ, వెటర్నరీ విభాగాల అధికారులతో సంపూర్ణ సమన్వయంతో క్షేత్రస్థాయిలో పని చేస్తోంది. పోలీసు చర్యలతో పాటు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులకు తదుపరి చర్యల నిమిత్తం మరో 247 కేసులు అప్పగించారు. అందులో పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు, ప్రజల నుంచినేరుగా వచ్చిన ఫిర్యాదులపై 90 కేసులు ఉన్నాయి. సమోసా తయారీ కేంద్రాలు వాటర్ ప్యాకింగ్ ప్లాంట్లు, బేకరీలు, హాస్టళ్లు, జెప్టో వంటి ఆన్‌లైన్ డెలివరీ సంస్థలపైనా కేసులు దాఖలయ్యాయి. కల్తీ నియంత్రణసహా నివారణ చర్యలపై పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కఠినమైన మార్గదర్శకాలను జారీ చేశారు. హెచ్-ఫాస్ట్ ప్రారంభించిన తక్కువ రోజుల్లోనే అద్భుత ఫలితాలు సాధించడంపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ప్రతి రోజు సగటున 15 వరకు కల్తీ ఆహార సమాచారం అందుతోందని, ప్రజల మద్దతు అభినందనీయమని కొనియాడారు. ఈ మహమ్మారిని అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమన్న సీపీ ఆహార కల్తీ జరిగినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.


# సంపాదకీయం

## కాళ్ల బేరానికి పాకిస్తాన్

అనధికార సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. కానీ ఒక్కసారిగా పాక్ భారత్‌ల మధ్య ఒక సంవత్సర కాలంలో 6 సార్లు ఈ సమావేశాలు జరగడం, భారత తరఫున మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద నరవానే, మాజీ దౌత్యవేత్త రుచి ఘనశ్యామ్, బిజెపి నాయకులు రామ్‌మాధవ్ పేర్లు ప్రస్తావించబడ్డాయి. పాకిస్తాన్ తరఫున రహమాన్, సజ్జయిడ్ హైదర్ ఖాన్, పూర్వ ఐఎస్ఐ నేతలు తదితరుల పేర్లు మీడియాలో వచ్చాయి. ట్రాక్ 1.5, ట్రాక్ -2 దౌత్యం అధికారిక ప్రభుత్వ చర్చలుకావు. మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ సైనికాధికారులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు, థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొని పరస్పర అభిప్రాయాలు పంచుకునే వేదికగా వీటిని భావిస్తారు. ప్రపంచంలోని అనేక సంక్షోభ ప్రాంతాల్లో ఇలాంటి చర్చలు గతంలో కూడా జరిగాయి. గత ఏడాది జులైలో లండన్‌లో జరిగిన ఐఐఎస్ఎస్ ట్రాక్ -1.5 సమావేశంతో ఈ శ్రేణి చర్చలు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. భారత్- పాకిస్తాన్ సంబంధాలు గత ఏడు దశాబ్దాలుగా యుద్ధాలు, ఉగ్రవాద దాడులు, సరిహద్దు ఉద్రిక్తతలు, దౌత్య వివాదాలతో సాగుతున్నాయి. ముఖ్యంగా పుల్వామా దాడి అనంతరం ఇరుదేశాల మధ్య అధికారిక దౌత్యచర్చలు దాదాపు నిలిచిపోయాయి. ఉగ్రవాదం, చర్చలు రెండూ కలిసి సాగవు అనే విధానాన్ని భారత్ పదేపదే ప్రకటించింది. అయితే ఇటీవలి ఏడాది కాలంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. లండన్‌కు చెందిన అంతర్జాతీయ వ్యూహాత్మక పరిశోధనా సంస్థ ఐఐఎస్ఎస్ నిర్వహించిన సమావేశాలు లేదా దాని సదస్సుల సందర్భంగా భారత్ -పాకిస్తాన్ ప్రతినిధుల మధ్య ట్రాక్-1.5, ట్రాక్ -2 స్థాయి అనధికారిక చర్చలు జరిగినట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామం దౌత్య, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇవన్నీ బిజెపి పూర్వ ప్రధాన కార్యదర్శి, ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు రామ్‌మాధవ్, ఆర్ఎస్ఎస్ నాయకులు దత్తాత్రేయ హోస బోలె అమెరికా, యూరోప్ పర్యటనల తరువాత మరింతగా బలం పుంజుకొన్నాయి. దత్తాత్రేయ హోస బోలె ఇటీవల పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, భారత్ పాక్‌ల మధ్య సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రజల మధ్య చర్చలు కొనసాగాలని తెలిపారు. దీన్ని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ సంచాలక మోహన్ భగవత్ కూడా సమర్థిస్తూ ప్రకటన చేశారు. పాక్‌పట్ల మొదటి నుండి వ్యతిరేకంగా ఉండే ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు, ఒక్కసారిగా తమ పద్ధతి మార్చుకొని, పాక్‌పట్ల మెతక వైఖరితో వ్యవహరించడంలో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఒత్తడి ఉందనే ప్రచారం జరుగుతుంది. ఆపరేషన్ సిందూర్ తరువాత అమెరికా వైఖరి పూర్తిగా పాక్‌కు అనుకూలంగా ఉండడం, యుద్ధాన్ని మేమే ఆపామని ట్రంప్ ప్రకటించడం, ఆ తరువాతి వ్యాపార ఒప్పందం సంఘటనలు అన్నీ ఈ వాదనకు బలం ఇస్తున్నాయి. ఇరాన్ అమెరికా యుద్ధ విరామంలో కూడా పాక్ చురుకుగా పాల్గొనడంతో, అమెరికా పూర్తిగా పాక్‌కు అనుకూలంగా, భారత్‌పై ఒత్తడి తెస్తుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ అనధికార సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. కానీ ఒక్కసారిగా పాక్ భారత్‌ల మధ్య ఒక సంవత్సర కాలంలో 6 సార్లు ఈ సమావేశాలు జరగడం, భారత తరఫున మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద నరవానే, మాజీ దౌత్యవేత్త రుచి ఘనశ్యామ్, బిజెపి నాయకులు రామ్‌మాధవ్ పేర్లు ప్రస్తావించబడ్డాయి. పాకిస్తాన్ తరఫున రహమాన్, సజ్జయిడ్ హైదర్ ఖాన్, పూర్వ ఐఎస్ఐ నేతలు తదితరుల పేర్లు మీడియాలో వచ్చాయి. ట్రాక్ 1.5, ట్రాక్ -2 దౌత్యం అధికారిక ప్రభుత్వ చర్చలుకావు. మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ సైనికాధికారులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు, థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొని పరస్పర అభిప్రాయాలు పంచుకునే వేదికగా వీటిని భావిస్తారు. ప్రపంచంలోని అనేక సంక్షోభ ప్రాంతాల్లో ఇలాంటి చర్చలు గతంలో కూడా జరిగాయి. గత ఏడాది జులైలో లండన్‌లో జరిగిన ఐఐఎస్ఎస్ ట్రాక్ -1.5 సమావేశంతో ఈ శ్రేణి చర్చలు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. భారత, పాకిస్తాన్ మాజీ దౌత్యవేత్తలు, భద్రతా నిపుణులు, వ్యూహకర్తలు ఇందులో పాల్గొన్నట్లు మీడియా నివేదించింది. ఆ తరువాత అక్టోబర్‌లో ఒమన్‌లోని మస్కట్‌లో జరిగిన దక్షిణ ఆసియా రక్షణ సంవేశం సందర్భంగా మరో ట్రాక్ -1.5 సమావేశం జరిగినట్లు సమాచారం వెలువడింది. ఈ సమావేశంలో కూడా ఇరు దేశాల మాజీ అధికారులు, వ్యూహాత్మక నిపుణులు పాల్గొన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. డిసెంబర్‌లో థాయ్‌లాండ్‌లో మరో ట్రాక్ 2 సమావేశం జరిగింది. ఇది ఎమిూా కార్యక్రమం కాకపోయినా, భారత్- పాక్ మధ్య అనధికారిక సంభాషణల శ్రేణిలో భాగంగా ప్రస్తావించబడింది. ఇందులో మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ దౌత్యవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నట్లు నివేదికలు వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఖతార్ రాజధాని దోహాలో మరో ట్రాక్ -2 సమావేశం జరిగింది. బ్రిటన్‌కు చెందిన ఒక థింక్‌ట్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కూడా ఇరుదేశాలకు చెందిన మాజీ దౌత్యవేత్తలు, వ్యూహాత్మక నిపుణులు పాల్గొన్నట్లు సమాచారం వెలువడింది. అత్యంత చర్చనీయాంశమైన సమావేశం జూన్‌లో శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన సందర్భంగా వెలుగులోకి వచ్చింది. ఈ సదస్సు పక్కన భారత్- పాకిస్తాన్ ప్రతినిధుల మధ్య అనధికారిక చర్చలు జరిగినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కొంత మంది భారత, పాకిస్తాన్ ప్రముఖుల పేర్లు మీడియాలో ప్రస్తావించబడ్డాయి. అయితే వారిలో కొందరు తాము పాల్గొనడాన్ని బహిరంగంగా ఖండించగా, ఎమిూా కూడా పూర్తి పాల్గొనేవారి జాబితాను విడుదల చేయలేదు. ఈ సమావేశాలపై వార్తలు వెలువడిన తర్వాత భారత ప్రభుత్వం స్పందిస్తూ, ఇవి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు కావని, ప్రభుత్వం తరఫున ఎలాంటి భాగస్వామ్యం లేదని స్పష్టం చేసింది. దీంతో ఈ చర్చలు పూర్తిగా స్వతంత్ర స్థాయిలో జరిగాయా లేక విధాన చర్చలకు అనుబంధ వేదికలుగా పని చేస్తున్నాయా అనే అంశంపై చర్చ మొదలైంది. ఈ పరిణామాల మధ్య ఆర్ఎస్ఎస్ నాయకుడు దత్తాత్రేయ హోసబలే పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉగ్రవాదంపై రాజీ ఉండదని చెబుతూనే, పాకిస్తాన్‌తో సంభాషణల తలుపులు పూర్తిగా మూసివేయకూడదని ఆయన అన్నారు. తరువాత ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కూడా సంభాషణను పూర్తిగా తిరస్కరించకూడదనే భావనను వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను కొందరు దౌత్యపరమైన పరిపక్వతగా చూడగా, మరికొందరు అధికారిక రాజకీయ వైఖరితో పోల్చి విశ్లేషించారు. దౌత్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ట్రాక్ -2 సమావేశాలు ప్రభుత్వ విధానానికి ప్రత్యామ్నాయం కావు. అయితే అధికారిక చర్చలు నిలిచిపోయిన సమయంలో సంక్షోభ నిర్వహణ, పరస్పర అవగాహన, అపార్థాల నివారణ వంటి అంశాల్లో ఇవి సహాయకరంగా ఉండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా- చైనా, అమెరికా -ఇరాన్, ఉత్తర కొరియా- దక్షిణ కొరియా వంటి దేశాల మధ్య కూడా గతంలో ఇలాంటి అనధికారిక చర్చలు జరిగాయి. అయితే భారత్- పాకిస్తాన్ సంబంధాల విషయంలో ప్రజల్లో ఒక సహజమైన ప్రశ్న తలెత్తుతోంది. ఒకవైపు ఉగ్రవాదంపై కఠిన వైఖరి ప్రకటిస్తూనే, మరోవైపు అనధికారిక స్థాయిలో సంభాషణలు కొనసాగడం పరస్పర విరుద్ధమా? లేక ఇది అంతర్జాతీయ దౌత్యంలో సహజమైన ద్వంద్వ వ్యూహమా? దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారాన్ని బట్టి చూస్తే, ఎమిూా వేదికగా లేదా ఇతర అంతర్జాతీయ థింక్‌ట్యాంక్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలు అధికారిక భారత్- పాకిస్తాన్ చర్చలు కావు. అదే సమయంలో, దక్షిణాసియా భద్రతా పరిస్థితులు, అణ్వాయుధ సమతుల్యత, ఉగ్రవాదం వంటి అంశాల నేపథ్యంలో ఇలాంటి అనధికారిక దౌత్య వేదికలకు అంతర్జాతీయ ప్రాధాన్యం పెరుగుతున్నదనేది స్పష్టంగా కనిపిస్తోంది. భవిష్యత్తులో ఈ ట్రాక్ -1.5, ట్రాక్ -2 చర్చలు అధికారిక దౌత్యానికి మార్గం సుగమం చేస్తాయా? లేక మేధోపరమైన చర్చలకే పరిమితమవుతాయా? అనేది రాబోయే పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

# రెండు దేశాలు.. ఒకే సామ్రాజ్యం

## అమెరికా స్వాతంత్య్ర ప్రకటనకు 250 ఏండ్లు




ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన బ్రిటిష్ సామ్రాజ్యానికి అతి చిన్న 13 వలస కాలనీల సముదాయం 1776లోనే సవాల్ విసిరింది. 171 ఏండ్ల తర్వాత 1947లో మరో దేశం అదే సామ్రాజ్యానికి వీడ్కోలు పలికింది. మొదటిది అట్లాంటిక్ మహాసముద్రం అవతల ఉన్న అమెరికా అయితే, దానికి వేల మైళ్ల దూరంలో హిందూ మహాసముద్రం ఒడ్డున సువిశాలం గా విస్తరించి ఉన్న భారత ఉపఖండం రెండవది. నాయకులు వేరు, పోరాట పద్ధతులు వేరు, కాలం వేరు. కానీ ఈ రెండు దేశాలు పోరాడింది ఒక్క శత్రువుతోనే-రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంతో. 2026 జూలై 4తో అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు 250 ఏండ్లు పూర్తవుతున్నా యి. ఆ సందర్భంగా ఆ దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని అవలోకనం చేసుకుంటే, భారత స్వాతంత్ర్యోద్యమంలోని అనేక దృశ్యాలు మన కండ్ల ముందు కదలాడుతాయి. ఒకదానికొకటి ప్రతిరూపాలు కాకపోయినా, సారూప్యాలు మాత్రం అనేకం. అమెరికా స్వాతంత్ర్యానికి దాదాపు ఒకటిన్నర శతాబ్దం ముందు, 1607లో ఇంగ్లండ్‌కు చెందిన 'లండన్ కంపెనీ' నేటి అమెరికా తూర్పుతీరంలోని వర్జీనియాలో, జేమ్స్ నది ఒడ్డున ఉన్న జేమ్స్‌టౌన్ పట్టణంలో తొలి శాశ్వత ఆంగ్ల కాలనీని స్థాపించింది. ఆ తర్వాత ఆంగ్లేయులు వనరులు సమృద్ధిగా ఉన్న అట్లాంటిక్ తీరప్రాంతాల్లో అంచెలంచెలుగా స్థిరపడుతూ వచ్చారు. ఆ విధంగా 1732 నాటికి మొత్తం 13 బ్రిటిష్ కాలనీలు ఆ ప్రాంతంలో పురుడు పోసుకున్నాయి. ఈ ఉదంతం..భారతదేశ పశ్చిమతీరంలోని సూరత్‌లో తొలుత వ్యాపారకేంద్రాన్ని ఏర్పాటు చేసి, అంచెలంచెలుగా తన ఆధిపత్యాన్ని విస్తరించుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీని గుర్తుకు తేవడం సహజం. అక్కడ లండన్ కంపెనీ అయితే, ఇక్కడ ఈస్ట్ ఇండియా కంపెనీ. 13 వలస కాలనీలు బ్రిటన్‌కు పాడి ఆవులుగా మారాయి. వర్జీనియా నుంచి పొగాకు, దక్షిణ ప్రాంతాల నుంచి బియ్యం, ఇండిగో, ఉత్తర ప్రాంతాల నుంచి కలప, చేపలు, జంతుచర్మాలు బ్రిటన్‌కు చేరేవి. అక్కడి పరిశ్రమలు వాటిని విలువైన ఉత్పత్తులుగా మార్చి తిరిగి అదే కాలనీల్లో విక్రయించేవి. భారత్‌లోనూ ఇదే ఒరవడి కనిపించింది. పత్తి, నీలిమందు, సుగంధద్రవ్యాలు, ఖనిజాలు బ్రిటన్‌కు చేరాయి. మాంచెస్టర్‌లో తయారైన వస్త్రాలు భారత్ మార్కెట్లను ముంచెత్తాయి. తాము పండించిన పత్తినే వస్త్రాల రూపంలో తిరిగి అధిక ధరలకు కొనాల్సిన దుస్థితి భారతీయులకు ఎదురైంది. 1763లో బ్రిటన్, ఫ్రాన్స్, మధ్య ఐరోపాతోపాటు ఉత్తర అమెరికా లోనూ ఆధిపత్యం కోసం సాగిన చారిత్రాత్మక 'ఏడేండ్ల యుద్ధం' ముగిసే నాటికి, మితిమీరిన యుద్ధవ్యయంతో బ్రిటన్ అప్పులకుప్పగా మారింది. దాంతో వలస పాలకులు కొత్త పన్నులతో అమెరికన్ల నడ్డి విరిచారు. 'ప్రాతినిధ్యం లేకుండా పన్నులు వద్దు' అనే నినాదం అమెరికా స్వాతంత్ర్యోద్యమానికి నాంది పలికింది. ఈ నినాదం ఎంతటి జాతీయ చైతన్యాన్ని రగిలించిందో, అంతకుమించిన స్వాతంత్ర్యకాంక్షను 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే నినాదం భారతీయుల్లో రగిలించింది. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం ద్వారా ఆ నినాదం స్వాతంత్ర్యోద్యమ దిశగా మళ్లించారు. 1773 డిసెంబర్‌లో జరిగిన బోస్టన్ టీ పార్టీ అమెరికా చరిత్రలో మరపురాని ఘట్టం. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన నౌకల్లో ఉన్న 342 టీ పెట్టెలను నిరసనకారులు సముద్రంలో విసిరి, వలసవాద ఆర్థిక విధానాలపై తమ నిరసనను ప్రపంచానికి చాటిచెప్పారు. భారత్‌లో 'స్వదేశీ' ఉద్యమ సమయంలో ప్రజలు విదేశీ వస్త్రాలను స్వచ్ఛందంగా దహనం చేశారు. రెండు దేశాల లక్ష్యం మాత్రం సామ్రాజ్యవాద ఉత్పత్తులను తిరస్కరించడమే. బోస్టన్ టీ పార్టీ తర్వాత బ్రిటన్ మరింత కఠినంగా వ్యవహరిస్తూ అక్కడి నౌకాశ్రయాన్ని మూసివేసింది. భారత్‌లోనూ ఇదే జరిగింది. బెంగాల్ విభజన వంటి ఏకపక్ష చర్య స్వదేశీ ఉద్యమాన్ని గడప గడపకూ చేర్చింది. రౌలత్ చట్టం దేశవ్యాప్త ఆందోళనలకు కారణమైంది. జలియన్‌వాలాబాగ్ మారణకాండతో ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. 1774లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో కాంటినెంటల్ కాంగ్రెస్ సమావేశమైంది. 13 కాలనీల ప్రతినిధులు తొలిసారి ఒకే వేదికగా ఐక్యకార్యాచరణపై చర్చించారు. భారతీయులకు ఈ దృశ్యం 1885లో బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహాసభను గుర్తు చేస్తుంది. ఆ తర్వాత 1906 కలకత్తా మహాసభ, 1929 లాహోర్ మహాసభలు భారత స్వాతంత్ర్యోద్యమానికి దిశానిర్దేశం చేసినట్లే, కాంటినెంటల్ కాంగ్రెస్ విడివిడిగా పోరాడుతున్న అమెరికా కాలనీలను ఒకే గొడుగు కిందికి చేర్చింది. 1776 జూలై 4న ఫిలడెల్ఫియాలో సమావేశమైన రెండో కాంటినెంటల్ కాంగ్రెస్ అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను ఆమోదించింది. అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవానికి ఇదే చారిత్రక మూలం. 1775లో లెక్సింగ్టన్, కాన్‌కార్డ్ ప్రాంతాల్లో జరిగిన కాల్పుల పర్యవసానంగా అమెరికా స్వాతంత్ర్య సమరం ప్రారంభమైంది. అప్పటికే ప్రజాభిమానాన్ని చూరగొన్న జార్జ్ వాషింగ్టన్ అమెరికా సైన్యాధ్యక్ష బాధ్యతలను స్వీకరించాడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ వంటి నాయకులు లక్షలాది మంది ప్రజలను అహింసాయుతంగా సంఘటితం చేస్తే, అమెరికాలో సాయుధ పోరాటానికి వాషింగ్టన్ నేతృత్వం వహించాడు. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, భారత్ ఛోడో ఆందోళనల ద్వారా గాంధీ జాతీయోద్యమానికి చిరునామాగా మారినట్లే, అమెరికాలో స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకగా వాషింగ్టన్ నిలిచాడు. థామస్ జెఫర్సన్ స్వాతంత్ర్య ప్రకటనకు రూపకల్పన చేశాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ పోరాటానికి ఫ్రాన్స్ మద్దతు సాధించాడు. జాన్ ఆడమ్స్ కాంగ్రెస్‌లో స్వాతంత్ర్యానికి బలమైన రాజకీయ వాదన వినిపించాడు. అలెగ్జాండర్ హామిల్టన్ యుద్ధ సమయంలో వాషింగ్టన్‌కు అండగా నిలిచి, తర్వాత దేశ అర్థవ్యవస్థకు బలమైన పునాది వేశాడు. ఇదే తరహాలో భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్, రాజాజీ, డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ వంటి ఎందరో నాయకులు తమ తమ రంగాల్లో కీలక పాత్ర పోషించారు. ఉభయదేశాల స్వాతంత్ర్యోద్యమాల అంతిమ లక్ష్యం ఒక్కటే- స్వేచ్ఛ. ప్రజల సంకల్పం ముందు ఎంతటి సామ్రాజ్యమైనా తలవంచక తప్పదని ఈ రెండు దేశాల చరిత్ర ప్రపంచానికి నిరూపించింది.

# జపాన్‌తో 'మిత్రలాభం'



శిఖరాగ్ర సమావేశాలకు దౌత్యంలో ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. రెండు దేశాల మధ్య ఆ స్థాయి సమావేశం జరిగిందంటే ఆ దేశాల అధినేతలు నేరుగా మాట్లాడుకుని, సంక్లిష్ట సమస్యల పరిష్కార సాధనకు కృషి చేస్తున్నారనీ, ఈ క్రమంలో ఎంతో జాప్యం చోటు చేసుకునే అధికారస్వామ్య ప్రమేయాన్ని అధిగమించదల్చుకున్నారనీ అర్థం. జపాన్ ప్రధాని సనే తకాయిచి మన దేశంలో మూడు రోజులు పర్యటించి శుక్రవారం వెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీతో శిఖరాగ్ర సమావేశం జరిపారు. ఈ పర్యటనలో కృత్రిమ మేధ(ఏఐ), ఇంధనం, రక్షణరంగం, ఖనిజాల వెలికితీత తదితర రంగాల్లో 17 ఒప్పందాలు కుదిరాయి. ఇందులో రక్షణ సాంకేతికతల్లో అత్యంతాధునికమైన 'యూనికార్న్' ప్రాజెక్టు ఒప్పందం అన్నివిధాలా ప్రత్యేకమైనది. యుద్ధ నౌకలపై వేర్వేరు అవసరాల కోసం వినియోగించే ఉపగ్రహ కమ్యూనికేషన్, రాడార్, నావిగేషన్, రేడియో కమ్యూని కేషన్ వంటి పనుల కోసం విడివిడిగా యాంటెన్నాలుంటాయి. యుద్ధసమయాల్లో ఇవి చిక్కులు తెస్తాయి. శత్రువుల రాడార్లకు సులభంగా దొరికిపోతాయి. యూనికార్న్ సాంకే తికతలో ఈ యాంటెన్నాలన్నీ ఒకే ఒకదాన్లో ఒదిగిపోతాయి. శత్రు నౌకలకు చిక్కకుండా, వాటి ఆనుపానుల్ని తెలుసుకోవటంలో దీని పని తీరు అద్భుతం. వచ్చిపడే క్షిపణుల్ని చాలా ముందే పసిగట్టడం, ఎదురుదాడికి అవకాశం ఇవ్వటం దీని ప్రత్యేకత. ఈ యూనికార్న్ మాస్ట్‌లను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ద్వారా దేశీయంగా తయారు చేసేందుకు జపాన్ సంసిద్ధత తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం రక్షణ ఎగుమతుల జోలికి పోవద్దని జపాన్ తీసుకున్న నిర్ణయాన్ని ఇటీవలే తకాయిచీ సడలించారు. అమెరికా విధిస్తున్న అడ్డగోలు సుంకాలు, పశ్చిమాసియాలో ఏర్పడిన అనిశ్చితిరెండు దేశాలనూ సమంగా పీడిస్తున్నాయి. ఈ దశలో పరస్పర సహకారం మరింతగా పెరిగితే ఈ పరిస్థితిని అధిగమించవచ్చునన్న అభిప్రాయం రెండు దేశాలకూ ఉంది. జపాన్‌తో మన సంబంధాలు విలక్షణమైనవి. రెండు దేశాల సంబంధాలను అభివర్ణించ టానికి దౌత్యంలో కొన్ని విశేషణాలుంటాయి. సహజమైన, ప్రత్యేకమైన, విశ్వసనీయ మైన, అనివార్యమైన... వంటివి అందులో కొన్ని. జపాన్‌తో మన సంబంధాల స్థాయిని తెలియజేయటానికి చాలామంది దౌత్యనిపుణులు వీటిని ఉపయోగిస్తారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నం. ఎంత మెరుగైన సంబంధాలున్నా అవి 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందాన ఉన్నాయి. ఇరుదేశాలమధ్యా సుహృద్భావం ఉంది. వేరే దేశాలతో ఏర్పర్చుకునే సంబంధాలకుండే రాజకీయ పరిమితులు కూడా ఇక్కడ లేవు. చైనాతో ఇరు దేశాలకూ ఉండే సమస్యలవల్ల వాటి మధ్య సాన్నిహిత్యానికి అవకాశాలెక్కువ. కానీ ఆసంబంధాలు తగినంతగా ఎదగలేదు. ఇరు దేశాలమధ్యా వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడి చాన్నాళ్లవుతున్నా వ్యాపార సంబంధాలు అంతంతమాత్రం. ద్వైపాక్షిక వాణిజ్యం 2,748 కోట్ల డాలర్లున్నా అందులో మన ఎగుమతుల విలువ కేవలం 600 కోట్ల డాలర్లు. మిగిలిందంతా జపాన్ నుంచి మనకొచ్చే దిగుమతుల వాటాయే. మన దేశానికి 1991 వరకూ జపాన్ అధికారిక అభివృద్ధి సాయం(ఓడీఏ) కింద ఆర్థిక సాయం అందించేది. ఢిల్లీ మెట్రో, ఈశాన్య రాష్ట్రాల సరుకు రవాణా కారిడార్ వంటి మౌలిక సదుపాయాల్లో జపాన్ ముద్ర ఉంది. కానీ పెట్టుబడులు పెట్టడంలో, వాణిజ్య విస్తరణ అంతంతమాత్రం. మన దేశంలో జపాన్ పెట్టుబడులు 4,000 కోట్ల డాలర్లు. కానీ తరచు లడాయివుండే చైనాలో దాని పెట్టుబడులు 13,000 కోట్ల డాలర్ల పైమాటే. చిన్న దేశం వియత్నాంలో కూడా జపాన్ 8,000 కోట్ల డాలర్ల మదుపు పెట్టింది. మన దేశంలో పనిచేస్తున్న జపాన్ సంస్థలు 1,400 మించవు. ఇందుకుభిన్నంగా థాయ్‌లాండ్‌లో జపాన్ సంస్థల సంఖ్య 6,000. మన మొత్తం వ్యాపార కార్యకలాపాల్లో జపాన్ కంపెనీల వాటా ఒక శాతం. అందులో కూడా ఆటోమొబైల్ వాటాయే అధికం. మన జనరిక్ మందులపై జపాన్‌లో అనేక రకాల ఆంక్షలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మన ఫార్మా రంగం ఎన్నో విజయాలు సాధిస్తున్నా అక్కడ సమస్యలు తప్పడం లేదు. ఇలాంటి అవరోధాలు అధిగమించగలిగితే ఇరు దేశాల సంబంధాలూ మరింత మెరుగైన స్థాయికి చేర తాయి. తకాయిచీ పర్యటన ఆ దిశగా మంచి ముందడు గని చెప్పుకోవచ్చు.

# తినే అన్నంలో కల్తీలు..తాగే పాలలో రసాయనాలు...
# చివరకు పసిబిడ్డలకు పట్టే పాలపాడిలోనూ ప్రాణాంతక పదార్థాలు..

లాభార్జనే పరమావధిగా సాగుతున్న నిశ్శబ్ద ముప్పుపై హైదరాబాద్ సిటీ పోలీస్ ఉక్కుపాదం మోపుతోంది..

ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం..










**నాంపల్లి,హైదరాబాద్,జూలై04(సూర్యరేఖ)** నగం వాసుల ఆయుష్షను హరిస్తు,ప్రజారోగ్యాన్ని నిలువునా దెబ్బతీస్తూన్న కల్తీ ముఠాల ఆటకట్టిం చేందుకు రంగంలోకి దిగిన హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్(హెచ్ ఫాస్ట్) ఏర్పాటై100రోజులను పూర్తి చేసుకుంది.ఈ ఏడాది మార్చి 19న శంఖారావం పూరించిన ఈ ప్రత్యేక విభాగం జీహెచ్ఎంసీ,ఫుడ్ సేఫ్టీ,వెటర్నరీ విభాగాల అధికారులను సమన్వయం చేసుకుం టూ నిరంతర దాడులు నిర్వహిస్తూ,ఆకస్మిక తనిఖీలతో నగరంలో ఆహార కల్తీపై రాజీలేని సమరం సాగిస్తోంది.

**ఆరోగ్యానికి గొడ్డలిపెట్టు...ఆహార కల్తీ..**

ఆహార కల్తీ అనేది కేవలం ఒక చట్టపరమైన నేరమో, వ్యాపార మోసమో కాదు,అది యావత్ సమాజంపై జరుగుతున్న నిశ్శబ్ద దాడి చేస్తుంది .పూర్వీకులు స్వచ్ఛమైన ఆహారంతో నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తే,నేడు కల్తీ విషం వల్ల సగటు ఆయుష్షు సగానికి పడిపోతోంది .రసాయ నాలు,నాణ్యత లేని నిల్వ పదార్థాల వాడకం వల్ల పసిబిడ్డల ఎదుగుదల దెబ్బతింటోంది. యువత, వృద్ధులు క్యాన్సర్,మూత్ర పిండాల వ్యాధులు, గుండె జబ్బుల బారిన పడుతున్నారు.దేశానికి వెన్నెముక లాంటి యువశక్తి రోగాల బారిన పడితే మానవ వనరుల ఉత్పాదకత తగ్గిపోతుంది.ఇది కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడమే కాకుండా దేశ ప్రగతిని దశాబ్దాలు వెనక్కినెడుతు ంది.కల్తీ ఆహారం వల్ల చికిత్సల రూపంలో, ఉత్పాదకత తగ్గడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 310బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని అంచనా.అందుకే కల్తీ లేని స్వచ్ఛమైన ఆహారం పొందడం ప్రతి పౌరుడి హక్కు ఆ హక్కును కాపాడుతూ భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించడమే హెచ్. .ఫాస్ట్ నిఘా పరమావధి.

**వంద రోజుల సమరంలో విస్తుపోయే నిజాలు..**

టాస్క్ ఫోర్స్ డీసీపీ నేతృత్వంలో 36మంది సుశిక్షితులైన అధికారులు,సిబ్బందితో నిరంతరం పనిచేస్తున్న హెచ్..ఫాస్ట్ విభాగం క్షేత్రస్థాయిలో కల్తీ రక్కసిని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది.ఈ వంద రోజుల్లో నగరవ్యాప్తంగా వివిధ జోన్ల పరిధిలో మొత్తం 185 కేసులు నమోదు చేసి,సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది.

**జోన్ల వారీగా వివరాలు పరిశీలిస్తే...**

అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్లో 55 కేసులు నమోదు కాగా,గోల్కొండ జోన్లో 44,సికింద్రాబాద్ జోన్లో 35,చార్మినార్ జోన్లో 21,శంషాబాద్ జోన్లో 13,జూబ్లీహిల్స్ జోన్లో 12,ఖైరతాబాద్ జోన్లో 5 కేసులు నమోదయ్యాయి.స్వార్థపరులు ప్రజల ప్రా ణాలతో ఏ విధంగా ఆడుకుంటున్నారో స్వాధీనం చేసుకున్న పదార్థాల వివరాలే స్పష్టం చేస్తున్నా యి.నిత్యం వాడే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు సంబం ధించి 27కేసుల్లో ఏకంగా 27,024.7కేజీల నకిలీ నిల్వలను పోలీసులు పట్టుకున్నారు.కృత్రిమ రసాయనాలతో పండ్లను మగ్గబెట్టే 16 ముఠాల గుట్టురట్టు చేసి 25,845 కేజీల పండ్లను సీజ్ చేశారు.చికెన్ వ్యర్థాల విక్రయాలకు సంబంధిం చిన 6 కేసుల్లో ఏకంగా 60టన్నుల కంటే ఎక్కువ చికెన్ను స్వాధీనం చేసుకోవడం గమనార్హం.వీటితో పాటు 3 కేసుల్లో 9,260 కేజీల నిల్వ పచ్చళ్లు,4 కేసుల్లో 4,030 కేజీల కల్తీ కోవా,7కేసుల్లో 3,897 కేజీల నకిలీ టీ పొడి,సుమారు 15టన్నుల నాణ్యత లేని చికెన్ మాంసం 12కేసుల్లో 3,260 కేజీల కల్తీ క్రీమ్,530 కేజీల కల్తీ నెయ్యి (1కేసు),సుమారు 2,706 కేజీల నాణ్యత లేని డ్రై ఫ్రూట్స్ ఖర్జూరం 2కేసుల్లో 2,500 కేజీల కల్తీ పెరుగు,1కేసుల్లో 1,514 కేజీల కల్తీ పనీర్,5 కేసులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో 120కేజీల నాణ్యత లేని ఫ్రైడ్ చికెన్ 2కేసుల్లో స్వాధీనం చేసుకున్నారు.ఐస్ క్రీములు,బిస్కెట్లు,ఆర్ఓ వాటర్ ప్లాంట్లు,జంక్ ఫుడ్స్ వంటి ఇతర విభాగాల్లో 34 కేసులు నమోదయ్యాయి.

**మరో 247కేసులు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ...**

పోలీసు చర్యలతో పాటు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్(ఎఫ్ఎస్ఓ)లకు తదుపరి చర్యల నిమిత్తం 247కేసులు అప్పగించారు.ఇందులో అత్యధికంగా పనీర్ అవుట్లెట్లపై 70కేసులు,ప్రజల నుంచి నేరుగా వచ్చిన ఫిర్యాదులపై90కేసులు నమోదు చేశారు.అలాగే సమోసా తయారీ కేంద్రాలపై 11,వాటర్ ప్యాకింగ్ ప్లాంట్లపై 9,మసాలాలు ,స్పైసెస్ పై 7,బేకరీలు,ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై చెరో 6 కేసులు,జెప్టోపై 5,హాస్టళ్లు,మాంసం దుకా ణాలపై చెరో 4కేసులు,ఐస్ తయారీ కేంద్రాలపై 3,చికెన్ వేస్ట్..సీ ఫుడ్పై3కేసులు దాఖలయ్యాయి. విభాగాల సమన్వయంతోనే కల్తీకి చెక్.. ఆహార కల్తీ నివారణ అనేది కేవలం ఒకే విభాగానికి పరిమితమైన అంశం కాదని,బహుళ ప్రభుత్వ విభాగాల ...

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో బీసీలు ఐక్యంగా ఉద్యమించాలి..

బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్



**మంచిర్యాల,జూలై04(సూర్యరేఖ)** తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని బీసీ సమాజ్ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ...నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని ప్రతి బీసీ యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు .చట్టసభలు,విద్య,ఉద్యోగాలు, రాజకీయాలు,పారిశ్రామిక రంగం సహా అన్ని రంగాల్లో బీసీలకు సముచిత వాటా దక్కే వరకు ఉద్యమం కొనసాగించాలని అన్నారు.తెలంగాణ ప్రజలు ఆనాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా ఏకమై పోరాడినట్లే, నేడు రాజ్యాంగబద్ధమైన హక్కులు, సముచిత ప్రాతినిధ్యం సాధించే వరకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పేర్కొన్నారు. బీసీ విద్యార్థులు,యువత,మహిళలు,మేధావులు, ఉద్యోగులు,ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.బీసీ సమాజం ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించే వారికి తగిన సమయంలో సమాజమే గుణపాఠం చెబుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు బొలిశెట్టి లక్ష్మణ్,నాయకులు ఏదునూరు రమేష్,చుంచు గురువయ్య,మంచర్ల సదానందం,ఎండి షఫీ ,పెద్దాల సత్యనారాయణ,కొంగోండ మధు,ఎండి లతీఫ్,గుండ్ల లక్ష్మణ్,తగరం శ్రీనివాస్,కలవల అంజయ్య,పల్లపు శ్రీనివాస్,ఆడేపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి కేజీబీవీలో హెడ్ కుక్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం..




**మందమర్రి,జూలై04(సూర్యరేఖ)** మందమర్రి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) లో ఖాళీగా ఉన్న హెడ్ కుక్ పోస్టును భర్తీ చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ రమేష్ తెలిపారు.స్థానిక మహిళా అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని శనివారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు.పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు2026 జూలై 1నాటికి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని అర్హతగా పేర్కొన్నారు.స్థానిక తహసీల్దార్ జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు తదితర అవసరమైన పత్రాలను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.జూలై 4నుంచి 7వ తేదీ సాయంత్రం4 గంటల వరకు మందమర్రి మండల విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి,అర్హత కలిగిన మహిళలు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని మండల విద్యాధికారి కోరారు.

# తెలంగాణ సాయుధ పోరాట తొలి దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి..





**ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్‌లో నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు**

**నారాయణఖేడ్,జులై04(సూర్య రేఖ)** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్‌లో ఘనంగా నివాళులర్పించారు.నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులో గల దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ,నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజీవ రెడ్డి మాట్లాడుతూ... “బహుజనుల విముక్తి కోసం,భూమి కోసం,భుక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అసువులు బాసి అమరుడయ్యారు. ఆయన చూపిన పోరాట పటిమ,ధైర్యం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయం.సమాజంలో వెనుకబడిన, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాన్ని మనం ఎప్పటికీ మరువలేం.దొడ్డి కొమురయ్య ఆశయాలకు అనుగుణంగా, నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం మనం నిరంతరం శ్రమిస్తాం”అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భోజీ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,విఠల్ రావు పాటిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,రమేష్ చౌహన్,పండరిరెడ్డి,రామచందర్ నాయక్,మాజీ ఎంపీటీసీ బాణాపురం రాజు,కౌన్సిలర్ ముంతాజ్ సెట్,మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సుకుమార్,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు,బీసీ కులాల ప్రముఖులు,యువకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అమరవీరుడు దొడ్డి కొమురయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు

## చిలుకానగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండున్నరేళ్ల సేవలు పూర్తి చేసిన ములకలపల్లి రాజేష్ ముదిరాజ్




**ఉప్పల్,జూలై04(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆశీస్సులతో చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ రెండున్నర సంవత్సరాల సేవా కాలాన్ని పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తన పదవీకాలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేసినట్లు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం,డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సూచనలు, సలహాలతో పార్టీ పెద్దలు అప్పగించిన ప్రతి బాధ్యతను విజయవంతంగా నిర్వహించగలిగినట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి సహకరించిన డివిజన్ ప్రజల సహకారం మరువలేనిదని అన్నారు.రానున్న రోజుల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పని చేస్తానని,ప్రజల ఆదరణ, ఆశీస్సులు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తనకు అవకాశాలు కల్పించి ప్రోత్సహించిన మందముల పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవిధంగా, చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహేందర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..







**రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తేలేత్తకుండా పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్ట్స్,ఇంజినీరింగ్ ఆభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని జీహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి వివిధ విభాగలకు చెందిన అధికారులతో కలిసి శనివారం ఉదయం జోన్ పరిధిలోనీ ఛత్రినాక,కందికల్ గేట్ ఆర్ఓబీ, బోయిగూడ, చాంద్రాయణగుట్ట,డిఆర్ డిఎల్ కంచన్ బాగ్,మిధానిరోడ్,ఆషామాబాద్,బండ్లగూడ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.ఛత్రినాక ప్రధాన చౌరస్తాలో కొనసాగుతున్న స్ట్రామ్ వాటర్ పైప్ లైన్,సిసి రోడ్డు నిర్మాణ పనులను ,పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో ఆరాతీశారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని.. పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఛత్రినాక ప్రధాన చౌరస్తాలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనుల కారణంగా సమస్యలు రాకుండా చూడాలన్నారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు.పనుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.చాంద్రాయణగుట్ట - ఛత్రినాక ప్రధాన రోడ్డు కావడంతో నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక శానిటేషన్ విభాగం అధికారులు,సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య సమస్యలు తేలేత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో జంగమెట్, చాంద్రాయణగుట్ట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సురేందర్,పాపయ్య, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ నరేందర్ గౌడ్,యూబీడి డిప్యూటీ డైరెక్టర్ విష్ణు వర్ధన్,ఎలక్ట్రికల్ డిఈ సత్యనారాయణరెడ్డి,ఈఈ, డిఈలు,ఏఈలు,శానిటేషన్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల రివిజన్ సర్వే ప్రారంభం..






**ప్రజలు సహకరించాలని కమిషనర్ తన్నీరు రమేష్ విజ్ఞప్తి**

**బెల్లంపల్లి,జులై04(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని నివాస గృహాలు,వాణిజ్య సముదాయాలు,షాపులు ఇతర భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నుల (హౌస్ ట్యాక్స్)రివిజన్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రతిష్మాత్మకంగా చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, మున్సిపల్ పరిపాలనశాఖ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని ప్రతి ఇంటి,ప్రతి షాపు ,ప్రతి వాణిజ్య భవనం ప్రస్తుత వివరాలను సేకరించి, వాస్తవ కొలతల ఆధారంగా ఆస్తి పన్నులను సవరించే ప్రక్రియ కొనసాగుతోంది.ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా,వేగవంతంగా పూర్తి చేయడానికి మున్సిపాలిటీ పరిధిలో 10ప్రత్యేక సర్వే బృందాలను నియమించారు.ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి భవనాల పొడవు,వెడల్పు,నిర్మాణ విస్తీర్ణం, వినియోగ విధానం(నివాసం లేదా వాణిజ్యం), అంతస్తుల సంఖ్య,నిర్మాణ రకం తదితర వివరాలను నమోదు చేయడంతో పాటు ఆధునిక కొలత పరికరాలతో భవనాలను కొలుస్తున్నాయి. అనంతరం సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్తి పన్నుల రివిజన్ చేపడుతున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ...పట్టణ అభివృద్ధికి ఆస్తి పన్నులు ప్రధాన ఆదాయ వనరని తెలిపారు.ప్రజలు చెల్లించే పన్నులతోనే రహదారులు, డ్రైనేజీలు,వీధి దీపాలు,పారిశుధ్యం,తాగునీటి సరఫరా,పార్కుల అభివృద్ధి,మురుగు కాలువల నిర్వహణ వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సర్వేలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.సర్వే బృందాలు ఇంటికి వచ్చినప్పుడు భవనాలకు సంబంధించిన సరైన వివరాలను అందించాలని, ఎలాంటి సమాచారం దాచిపెట్టకుండా సహకరించాలని సూచించారు. భవనాల కొలతలు తీసుకునేందుకు సిబ్బందికి అనుమతి ఇవ్వడంతో పాటు అధికారులు అడిగే వివరాలను సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. సర్వే బృందాలు అధికారిక గుర్తింపు కార్డులతోనే ప్రజలను సంప్రదిస్తాయని ,ప్రజలు ఎటువంటి అపోహలకు గురికాకుండా వారికి సహకరించాలని కోరారు. ఎవరైనా అధికారుల పేరుతో తప్పుడు వివరాలు సేకరించే ప్రయత్నం చేసినా లేదా డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. బెల్లంపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా మున్సిపాలిటీ చేపడుతున్న ఈ కార్యక్రమానికి సహకరించాలని కమిషనర్ తన్నీరు రమేష్ విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో ఆస్తి పన్నుల రివిజన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి,పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్,రెవెన్యూ అధికారి (ఆర్.ఓ.)ఆర్. భుజంగరావు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా,విత్తనాల పంపిణీలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

**మరిపెడ ఏడిఏ మురళిని సన్మానించిన ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**



**మరిపెడ,జూలై04(సూర్యరేఖ)** మరిపెడ డివిజన్ వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మురళిని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. .రైతులకు యూరియా,విత్తనాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పంట మార్పిడి విధానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు,ఉద్యానవన పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.రైతుల సంక్షేమం,వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని,రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

## ఘనంగా స్వామి వివేకానంద 124వర్ధంతి వేడుకలు..

**ముఖ్యఅతిథిగా హాజరైన వివేకానందకు ఘనంగా నివాళులర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్,జూలై04(సూర్యరేఖ)** స్వామి వివేకానంద యూత్ అధ్యక్షులు ఈరెల్లి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో స్వామి వివేకానంద 124వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎభారత జాతి గర్వించదగ్గ మహనీయుడు,యువతకు చిరస్థాయి స్ఫూర్తి ప్రదాత ,యువతకు స్ఫూర్తి ప్రదాతాన్ని పేర్కొన్నారు. స్వామి వివేకానంద బోధనలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి చిలుకానగర్ అఖిలపక్ష నాయకులు ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, యువజనులు, అభిమానులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు ముఖ్య సలహాదారులు ముక్కల రామకృష్ణ చైర్మన్ కటకం సంజయ్, వ్యవస్థాపకులు ఠాకూర్ ఉమేష్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఇంద్రాల రమేష్ మాజీ అధ్యక్షులు ముక్కాలా హరికృష్ణ ముదిరాజ్,ముష్యం జయ చందర్ సకినాల ప్రసాద్,చిలువేరు సత్యనారాయణ, విశ్వనాధ్ శరత్,అఖిల్, నాని, మల్లేష్,లక్ష్మణ్ మరియు సభ్యులు పాల్గొన్నారు

## రామంతపూర్,వెంకట్ రెడ్డినగర్ డివిజన్లలో రూ.97 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**రామంతపూర్,జూలై04(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో వెంకట్ రెడ్డినగర్ డివిజన్ మరియు రామంతపూర్ డివిజన్ పరిధిలో మొత్తం రూ.97లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నెహ్రూ నగర్‌లో రూ.8లక్షలతో 100 మి.మీ వ్యాసం గల వాటర్ లైన్ పనులు,బాలాజీనగర్--శ్రీరామ కాలనీలో రూ.15 లక్షలతో 100 మి.మీ వ్యాసం గల వాటర్ లైన్ పనులు,శ్రీనగర్ కాలనీలో రూ.10 లక్షలతో 300 మి.మీ వ్యాసం గల సీవరేజ్ లైన్ పనులు,సత్యనగర్‌లో రూ.24లక్షలతో 200 మి.మీ వ్యాసం గల సీవరేజ్ లైన్ పనులు,అలాగే లక్ష్మీ శ్రీకాంత్ నగర్‌లో రూ.40 లక్షలతో 300/200 మి.మీ వ్యాసం గల సీవరేజ్ లైన్ పనులు ఉన్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వరరావు,పార్టీ నాయకులు,కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సాధికారత దిశగా ముందడుగు వేయాలి..





**నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..**

**వయోజన విద్యాశాఖ రాష్ట్ర సంచాలకులు ఏ.శ్రీనివాస్ రెడ్డి**

**మందమర్రి,జూలై04(సూర్యరేఖ)** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని ఆర్థిక స్వావలంబన సాధిస్తూ సాధికారత దిశగా అడుగులు వేయాలని వయోజన విద్యాశాఖ రాష్ట్ర సంచాలకులు ఏ.శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. వయోజన విద్యాశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి సహకారంతో నిర్వహించిన 100రోజుల కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కుట్టు శిక్షణ పరీక్షకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పరీక్ష పత్రాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ...కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలను సృష్టించుకొని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. చదువును మధ్యలో నిలిపివేసిన మహిళలు ఓపెన్ పదో తరగతి,ఇంటర్మీడియట్,డిగ్రీ కోర్సుల ద్వారా విద్యను కొనసాగించాలని కోరారు.చదువుకున్న మహిళలు నిరక్షరాస్యులకు అక్షరాస్య తను అందించేందుకు ముందుకు రావాలని,సమాజంలో నిరక్షరాస్య తను పూర్తిగా రూపుమాపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వయోజన విద్యాశాఖ నిజామాబాద్ జిల్లా డైరెక్టర్ పురుషోత్తం నాయక్ మాట్లాడు తూ.. మంచిర్యాల జిల్లాలో జిల్లా కలెక్టర్, అధికారుల సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాలు విజయవంతంగా వంద రోజులపాటు నిర్వహిం చామని తెలిపారు.మహిళల సాధికారతకు ఈ శిక్షణలు ఎంతో ఉపయో గపడుతున్నాయని అన్నారు.సఖి క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డీఆర్‌పీ బండ శాంకరి, సుమన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ఆర్గనైజర్ ఉప్పులేటి నరేష్, శిక్షకురాలు ఉప్పులేటి శారదతో పాటు పలువురు శిక్షణార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమా నికి సఖి క్లబ్ అడ్మినిస్ట్రేటర్,డిఆర్పి బండ శాంకరి,సుమన్ లు అధ్యక్షత వహించగా కుట్టు శిక్షణ కేంద్రం కో-ఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక,ఆర్గనైజర్ ఉప్పులేటి నరేష్, శిక్షకురాలు ఉప్పులేటి శారద తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు..



**కామారెడ్డి,జూలై04(సూర్యరేఖ)** దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శనివారం కామారెడ్డి ఐడీఓసీలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)విక్టర్,అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)ఎన్.వై.గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...దొడ్డి కొమురయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన తొలి అమరవీరుడని అన్నారు.భూమి కోసం,పీడిత ప్రజల హక్కుల సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య,జిల్లా అధ్యక్షులు భూమ న్న, శ్రీనివాస్,చింతల శంకర్,జిల్లా అధికారులు,ప్రభుత్వ ఉద్యోగులు ,బహుజ న సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అతివేగంతో ఇసుక లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు..






**నిజాంపేట,జూన్4(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం,చల్మెడ గ్రామానికి చెందిన బొమ్మన మల్లేశం తన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై కమాన్ రోడ్ నుంచి రోడ్డు దాటుతుండగా,అతివేగంగా వచ్చిన టీజీ15 టీ 2444 నంబర్ గల ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశంకు తలకు తీవ్ర గాయాల య్యాయి.చెవి నుంచి రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## విద్యార్థిని చదువుకు స్ఫూర్తినిచ్చిన స్ఫూర్తి ఫౌండేషన్



**ఖమ్మం,జులై04(సూర్యరేఖ)** కల్లూరు మండలం చంద్రుపట్ల జడ్పీఎస్ఎస్, పాఠశాలలో చదివి పదవ తరగతిలో 571 మార్కులతో మండల ర్యాంక్ సాధించి బాసర ఐఐటిలో రామిశెట్టి సాయి వెన్నల సీటు సాధించారు.స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో నర్సింగ్ (యూఎస్ఏ)ధాత ద్వారా రూ,1,5200 ఆర్థికసహాయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,గ్రామ సర్పంచి కాటంనేని విజయలక్ష్మి , ఉపసర్పంచి రాధాకృష్ణ ,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి,స్ఫూర్తి కమిటీ సభ్యులు చేతుల మీదుగా చెక్కును శనివారం అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు కాటంనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.ఇంతటి సహాయాన్ని అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ కి, మరియు ధాతలకు విద్యార్థిని తల్లి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు

## చల్మెడ రహదారి అధ్వాన్నం..గుంతల్లో నిలిచిన వర్షపు నీరు..

**ప్రయాణికులకు తప్పని తిప్పలు**




**నిజాంపేట,జూన్04(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ కమాన్ నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వర్షాల కారణంగా పూర్తిగా గుంతలమ యంగా మారింది.గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదా రులు,గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం కంకర వేసినప్పటికీ, ఇప్పటివరకు డాంబరు పనులు ప్రారంభించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రహదారి అధ్వాన్నంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణం గా మారిందని,అత్యవసర పరిస్థితుల్లో కూడా గ్రామానికి చేరుకోవ డం కష్టంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు,కాంట్రాక్టర్ వెంటనే స్పందించి డాంబరు పనులు పూర్తి చేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తు లు, ప్రయాణికులు కోరుతున్నారు.

## పాఠశాల ఆవరణలోని గుంత వద్దకు పిల్లలను పంపవద్దు:



**నిజాంపేట,జూన్04(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.ఈ పనుల్లో భాగంగా పాఠశాల ఆవరణలో పెద్ద గుంత తవ్వినట్లు ప్రధానోపాధ్యాయు రాలు అరుణ తెలిపారు.ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లలు పాఠశాల ఆవరణలోకి ఆడుకోవడా నికి వచ్చే అవకాశం ఉన్నందున, తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల ప్రాంగణంలోకి పంపించవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.భద్రతా చర్యల్లో భాగంగా గుంతలో రింగులు ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగానికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి:

**గ్రామ కార్యదర్శి**



**నిజాంపేట,జూన్04(సూర్యరేఖ)**మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామం లో శనివారం గ్రామ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ ప్లాస్టిక్ వినియోగ నియం త్రణపై గ్రామస్తులకు అవగా హన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామం లోని కిరాణా దుకాణాల యజమానులకు ప్లాస్టిక్ వినియో గాన్ని తగ్గించా లని సూచించా రు.అలాగే ఇంటి వద్ద సేకరించిన పొడి చెత్తను బ్లూ కలర్ డస్ట్‌బిన్‌లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు.గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచేందుకు ప్రతి గ్రామస్తుడు బాధ్యతగా వ్యవహరించి గ్రామాభి వృద్ధికి సహకరించాలని ప్రశాంత్ గౌడ్ పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి..



**నిజాంపేట,జూన్04(సూర్యరేఖ)**మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన బేగంపేట పోచవ్వ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.ఇట్టి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి వెంటనే స్పందించారు. స్థానిక గ్రామ సర్పంచ్ అందె కొండల్ రెడ్డి ద్వారా సమాచారం అందుకున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, స్థానిక నాయకుల చేతుల మీదుగా మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్యామల శివరాములు,గ్రామస్తులు రామచంద్ర రెడ్డి, గోపాల్ రెడ్డి,వార్డు సభ్యులు బ్యాగరి రేణుక,మహిపాల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసన..

**డిప్యూటీ తాహసిల్దార్ కు వినతి..**



**నిజాంపేట,జూన్04(సూర్యరేఖ)** మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ తాహసిల్దార్ వినతిపత్రం అందజేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఉపాధ్యాయులు విద్యారంగ సమస్యలను మరోసారి తీసుకెళ్లాలని కోరారు.ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్,ప్రధాన కార్యదర్శి నరేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,ను కలిసిన నూతన డివిజన్ అధ్యక్షులు





**మేడ్చల్,జులై04(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సహకారంతో, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రకటించిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకాల్లో భాగంగా నూతనంగా నియమితులైన మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు)ముదిరాజ్, కిష్టాపూర్--పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,లు మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి,బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,లు నూతన అధ్యక్షులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేస్తూ,పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ,వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా,బత్తుల మధుకర్ యాదవ్, మేడ్చల్ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి,సీనియర్ నాయకులు తొంట యాదయ్య,దుర్గం వెంకటేష్ ముదిరాజ్,చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్,ఉదండపురం సత్యనారాయణ,పెగుడ శ్యాంరావ్, సద్ది ప్రకాష్ రెడ్డి, పానుగంటి మహేష్ కుమార్,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ,నాయకులు,కార్యకర్తలు, యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తొలి సారిగా బీటీ పత్తి రకాన్ని విడుదల చేసిన వ్యవసాయ వర్సిటీ..

**పత్తి రైతులకు భారీగా తగ్గనున్న విత్తన ఖర్చు,ప్రతి యేటా విత్తనం కొనాల్సిన అవసరం లేదు..**

**మరో పదకొండు కొత్త రకాలకు ఆమోదం:**

**విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య**

**రాజేంద్రనగర్,జులై04(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య శనివారం రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయలో ఈ మధ్య నవీకరించిన కిద్వాయ్ కాటేజీ,రిసార్ట్స్ లో మీడియా సమావేశం నిర్వహించారు.దీనిలో విశ్వవిద్యాలయం వివిధ పంటలకి సంబధించి విడుదల చేసిన పన్నెండు కొత్త రకాల గురించి వివరాలు తెలియచేసారు.దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా బీటీ పత్తి రకం (డబ్ల్యుజిసివి బీటీ-28)అనే నూతన రకాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన కమిటీ ఆమోదం తెలిపిందని జానయ్య తెలిపారు.ఈ బీటీ పత్తి రకం దక్షిణాది రాష్ట్రాలలో సాగుకి మంచి అనుకూలమైనదని కేంద్ర కమిటీ నిర్ధారించిందని ఆయన పేర్కొన్నారు.బీటీ పత్తి విత్తన రంగంలో గత 20ఏళ్ళుగా ప్రైవేటు సంస్థల ఆధిపత్యానికి విశ్వవిద్యాలయం రూపొందించిన ఈ కొత్త రకంతో కొంత అడ్డుకట్ట వేయవచ్చని ఆయన తెలిపారు.అదే విధంగా ఈ విత్తన రకం సాగు వల్ల ఎకరానికి సుమారు నాలుగు, ఐదు వేల రూపాయల విత్తనంపై పెట్టే ఖర్చు తగ్గుతుందని జానయ్య తెలిపారు.అంతే కాకుండా రైతులు తమ విత్తనాల్ని తామే మరలా విత్తుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. అదే విధంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన వివిధ పంటలకి చెందిన మరో 11నూతన రకాలకి కూడా



రాష్ట్రస్థాయి కమిటీ ఇటీవల విడుదలకు ఆమోదం తెలిపిందని అల్దాస్ జానయ్య తెలిపారు.ఆరు వరి రకాలు,మొక్క జొన్న,సోయా చిక్కుడు,కంది ,పెసర, మినుము పంటలకి సంబధించిన ఒక్కొక్కటి ఆమోదం లభించిందని పేర్కొన్నారు.వచ్చే ఏడాది ఈ కొత్త రకాలకు సంబధించిన విత్తనోత్పత్తి చేసి రైతులకి అందుబాటులోకి తీసుకుని వస్తామని అల్దాస్ జానయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ మరాటీ బలరాం,ఈ ఈ పంట రకాల అభివృద్ధిలో పాలు పంచుకొన్న శాస్త్రవేత్తలు డా.ప్రశాంత్, డా.శ్రీధర్ సిద్ధి,డా.శ్రావణి లతో పాటు విశ్వవిద్యాలయ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## అగ్రి వర్సిటీ ప్రతిపాదించిన 11 నూతన రకాల వంగడాల విడుదలకు ఆమోదం..

**నూతన రకాల వంగడాలను రూపొందించిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపిన**

**వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**



**రాజేంద్రనగర్,జులై04(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన అభివృద్ధి చేసిన మొట్టమొదటి బిటి పత్తి రకం “డబ్ల్యుజిసివి బీటీ-28” పత్తి రకాన్ని ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ (ఏఐసీపీ)--కాటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెరైటీ ఐడెంటిఫికేషన్ కమిటీ (విఐసి-2026) సమావేశంలో దక్షిణ మండలంలో సాగునీటి పరిస్థితులకు అనుకూలమైన రకంగా గుర్తించడం జరిగింది.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డా.ఆల్దాస్ జానయ్య హర్షం వ్యక్తం చేశారు.అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన 11నూతన వంగడాలను విడుదల చేయుట కొరకు జూన్ 2వ తేదీన రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి పంట రకాల విడుదల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అగ్రి వర్సిటీ ప్రతిపాదించిన నూతన రకాల విడుదలకు ఆమోదం తెలిపింది.వీటిలో పంటల వారీగా చూసినట్లయితే వరిలో ఆరు, మొక్కజొన్న, సోయాచికుడు,కంది,పెసర,మినుము పంటలలో ఒక్కొక్కటి చొప్పున అధిక దిగుబడి మరియు చీడపీడలను తట్టుకునే రకాలను రాష్ట్రస్థాయిలో సాగు నిమిత్తం అధికారికంగా విడుదలకు సిఫారసు చేయబడినాయి. ఈ సందర్భంగా నూతన రకాల రూపొందించిన



శాస్త్రవేత్తలకు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య శుభాకాంక్షలు తెలియజేశారు.ఈసమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి,వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం,వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ నర్సింహారావు,విత్తన జాయింట్ డైరెక్టర్ సుచరిత, వ్యవసాయ విశ్వవిద్యాలయ విత్తన డైరెక్టర్ డాక్టర్ నగేష్,తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధృవీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కిరణ్,కేంద్ర ప్రభుత్వ విత్తన విడుదల డిప్యూటీ కమిషనర్ బినోద్ గోరి, రాష్ట్ర ఉద్యానవన పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ,నూతన రకాల రూపకల్పన శాస్త్రవేత్తలు మరియు నూతన రకాల విడుదల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద..

**చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నులకలపల్లి రాజేష్ ముదిరాజ్**



**చిలుకానగర్,జూలై 04(సూర్యరేఖ)** భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందాన్ని చిలుకనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ అన్నారు.స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకొని చౌరస్తాలో వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత మేలుకో అని పిలుపునిచ్చి యువతకు ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని,స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిలుకనగర్ డివిజన్ అధ్యక్షులు నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రఘు,బీసీ సెల్ అధ్యక్షుడు దుండగుల శంకర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమర్, చైతన్య గౌడ్, రమేష్,రాధాకృష్ణ ,బియ్యం కిరణ్, సత్యం,శరత్ పాల్గొనారు.

## దొడ్డి కొమురయ్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..

**మేడ్చల్‌లో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు..**

**చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**



**మేడ్చల్,జూలై04(సూర్యరేఖ)** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య కురుమ జయంతి సందర్భంగా మేడ్చల్ డివిజన్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, పూడూర్- కిష్టాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ పాటు పలువురు నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భూమి కోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరీ నిర్మూలన కోసం పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు .భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన ఆయన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ మహనీయుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,వారి ఆశయాలను కొనసాగించేందుకు సమాజం కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు గౌర్ల మధు కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి,మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ,బత్తుల శివకుమార్ యాదవ్,వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా,బత్తుల మధుకర్ యాదవ్, నారెడ్డి రవీందర్ రెడ్డి,వెంకట్ రాంరెడ్డి,గుండ శ్రీధర్ కురుమ, దండు శ్రీకాంత్ (చింటు),కురుమ సంఘం నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హబ్సీగూడలో పదవరోజు ఎస్ఐఆర్ ప్రక్రియ



**హబ్సిగూడ,జూలై04 (సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి,హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి,ల ఆదేశాలతో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ దిగ్విజయంగా కొనసాగుతోంది.కోఆర్డినేటర్ గుండు రాజన్న ఆధ్వర్యంలో హబ్సీగూడ డివిజన్‌లో పదవ రోజు ఎస్ఐఆర్ ప్రక్రియ దిగ్విజయంగా కొనసాగుతోంది. బీఎల్ఓ ఆఫీసర్లతో పాటు కాంగ్రెస్ బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్‌లు అందజేస్తున్నారు.ఫామ్‌లను నింపాల్సిన విధానంపై ఓటర్లకు క్షుణ్ణంగా వివరిస్తున్నారు.అర్హత గల ఏ ఒక్కరి ఓటును తొలగించొద్దని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఏ బ్లాక్ సెక్రటరీ,బూత్ నంబర్ 249 బీఎల్ఏ మురళీ కృష్ణ ముదిరాజ్,బూత్ ఇన్‌ఛార్జ్,బూత్ నంబర్ 250 బీఎల్ఏ గుండు రాజన్న,బూత్ నంబర్ 245 బీఎల్ఏ మాలు నాయక్, బూత్ నంబర్ 248 బీఎల్ఏ శివ , బూత్ నంబర్ 243బీఎల్ఏ రంజిత్ 251బిఎల్ఏ ఆర్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# అత్తాపూర్ లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణం..



గోడపై నోటీసు అంటించిన దేవాదాయశాఖ అధికారులు



**రాజేంద్రనగర్,జులై04(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దేవాదాయశాఖ అధికారులు శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేవాలయానికి చెందిన సర్వేనంబర్లు 72నుండి 77వరకు గల స్థలంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా షెడ్డు (భవన నిర్మాణం)నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.?ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈవో) శ్రీకాంత్ నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టి,సదరు నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాల్సిందిగా ఆదేశిస్తూ శనివారం అక్కడి గోడపై అధికారిక నోటీసును అంటించారు.

**ఆధారాలు చూపకపోతే క్రిమినల్ కేసులు.!**

దేవాదాయశాఖ జారీ చేసిన నోటీసు(లేఖ సంఖ్య: ఎస్ఆర్ సిఎస్టి/01/2016) ప్రకారం..దేవాలయ భూమిలో సాగుతున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే ఆపివేయాలని హెచ్చరించారు.అంతేకాకుండా,ఆ భూమిపై నిర్మాణదారులు తమకు గల యాజమాన్య హక్కులను రుజువు చేసే చట్టబద్ధమైన పత్రాలను వెంటనే అధికారుల ముందు సమర్పించాల్సి ఉంటుంది.నిర్దేశిత గడువులోగా భూమికి సంబంధించిన సరైన పత్రాలను సమర్పించని యెడల,ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.దేవాదాయ చట్టం 30/87 నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కార్యనిర్వహణాధికారి శ్రీకాంత్ స్పష్టం చేశారు. ?ఈ విషయమై మరిన్ని వివరాలు లేదా సమాచారం కోసం ఆలయ కార్యాలయాన్ని లేదా 9912490641 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# కొణిజేటి రోశయ్య సేవలు భావితరాలకు ఆదర్శం..

అజాతశత్రువుగా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నాయకుడు రోశయ్య..

ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి..





**మరిపెడ,జూలై04(సూర్యరేఖ)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య ప్రజా జీవితంలో నెలకొల్పిన విలువలు,ఆయన అందించిన సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆర్యవైశ్యుల సంఘం ప్రతినిధులతో కలసి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అజాతశత్రువుగా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు కొణిజేటి రోశయ్య అని పేర్కొన్నారు.రాజకీయాల్లో హుందాతనం,సౌమ్యత, విషయ పరిజ్ఞానం,ఆర్థిక వ్యవహారాలపై అపార పట్టు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని,ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేశారని పేర్కొన్నారు. తమిళనాడు గవర్నర్గా రాజ్యాంగబద్ధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారని చెప్పారు.సహనం, నిష్పక్షపాత ధోరణి,నైతిక విలువలు,ప్రజల పట్ల మమకారం వంటి గొప్ప లక్షణాలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సినవని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకటరామారావు,కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్,ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు కందిబండ ప్రసాద్,వాసవి భవన్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల నాగేశ్వరరావు,వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ గర్రెపల్లి వెంకన్న,వాసవి క్లబ్ అధ్యక్షుడు గర్రెపల్లి నాగేష్,మచ్చా వెంకటరామణర్సయ్య,సోమ శ్రీనివాస్,మచ్చా మురళి,కర్లపాటి మధు, గొండ్రాల అంబరీష్,మురారిశెట్టి రాజు,వంగవీటి భద్రయ్య,సోమ నాగయ్య, గర్రెపల్లి జానకిరామయ్య,గర్రెపల్లి నర్సయ్య,దారం నాగేశ్వరరావు, ఉల్లి శ్రీనివాస్ (థియేటర్),కటకం వెంకటేశ్వర్లు,బోనగిరి ఉపేందర్,ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు,సభ్యులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 18అంశాలకు ఏకగ్రీవ ఆమోదం..

మొక్కల కొనుగోలుకు సంబంధించిన రెండు అంశాలు తదుపరి సమావేశానికి వాయిదా..




**రామకృష్ణాపూర్,జూలై04,(సూర్యరేఖ)**క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం చైర్పర్సన్ గొడిసెల సంధ్యారాణి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.సమావేశంలో మొత్తం 20 అంశాలతో కూడిన ఎజెండాను మున్సిపల్ కమిషనర్ ఏ. మారుతిప్రసాద్ సభ్యులకు వివరించగా,వాటిలో 18 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.మొక్కల కొనుగోలుకు సంబంధించిన రెండు అంశాలను ఖచ్చితమైన అంచనాలు సిద్ధం చేసి తదుపరి సమావేశంలో ప్రవేశపెట్టాలని సభ్యులు నిర్ణయించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర రహదారి మరమ్మతుల కోసం స్టోన్ డస్ట్, వెట్మిక్స్ కొనుగోలు,నర్సరీ నిర్వహణకు టౌన్ లెవల్ ఫెడరేషన్ (టిఎల్ఎఫ్)ద్వారా నాలుగు నెలల పాటు ఆరుగురు కార్మికుల నియామకం,ఓపెన్కాస్ట్ ప్రాజెక్టు నుంచి మట్టిని రవాణా,లోడింగ్--అన్లోడింగ్ పనులు,అవుట్సోర్సింగ్ సిబ్బందికి ఏడాది కాలానికి ఆరోగ్య బీమా కల్పించడం వంటి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.అలాగే అత్యవసర నీటి సరఫరా లీకేజీల నివారణకు అవసరమైన సామగ్రి కొనుగోలు, సిస్టమ్ అసిస్టెంట్ పదవీకాలం పొడిగింపు,చైన్ సా, పోర్టబుల్ వాటర్ పంపు కొనుగోలు,వార్డు సభల నిర్వహణకు సంబంధించిన టెంట్ హౌస్,తాగునీరు, సౌండ్ సిస్టమ్ తదితర బిల్లుల చెల్లింపు,రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు,కాల్వల శుభ్రత కోసం బ్యాక్హో లోడర్ కొనుగోలు,మూడు నెలల పాటు 30మంది పారిశుద్ధ్య కార్మికులను టిఎల్ఎఫ్ ద్వారా నియమించడం వంటి అంశాలకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది.శ్రీనివాస గార్డెన్ నుంచి ఎంఎన్ఆర్ గార్డెన్ వరకు ఉన్న రహదారిపై ప్రమాదాల నివారణ కోసం రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.కాగా ప్రతి ఇంటికి పంపిణీ చేయాల్సిన మొక్కలు,అలాగే శ్రీనివాస గార్డెన్--ఎంఎన్ఆర్ గార్డెన్ సెంట్రల్ డివైడర్లో నాటేందుకు అవసరమైన మొక్కల కొనుగోలుకు సంబంధించి సమగ్ర అంచనాలు సిద్ధం చేసి తదుపరి కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి తీసుకురావాలని సభ్యులు సూచించారు. సమావేశంలో వైస్ చైర్పర్సన్ మిట్టపల్లి సరిత, రెవెన్యూ అధికారి కె.సతీష్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయికిరణ్,ఎస్ఐ ఆర్.సునీల్ కుమార్, సీనియర్ అకౌంటెంట్ ఇ.వీరన్న, టీపీఎస్ బి. రాజ్కుమార్,టీపీబీఓ సాయి నిఖిల్తో పాటు కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కిష్టపూర్ లో సర్ ప్రక్రియను పరిశీలించిన మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్



**మేడ్చల్,జులై 04(సూర్యరేఖ)** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు--కిష్టాపూర్ డివిజన్ అర్చన కాలనీలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ తో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు,మార్పులు, తొలగింపులు,చిరునామా సవరణ వంటి అంశాల కోసం అవసరమైన దరఖాస్తులను సమర్పించాలని ప్రజలకు సూచించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఓటరు జాబితా పారదర్శకంగా,తప్పులు లేకుండా రూపొందేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తుడుం గణేష్ అన్నారు.ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ఓలను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిఎల్ ఓ అధికారిని నాగమణి స్థానిక నాయకులు కుమార్,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## రామాయంపేటలో భారీ వర్షం..

పట్టణంలో రోడ్లపై వార్డుల్లో నిలిచిన వర్షపు నీరు, ప్రజలకు,వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు..



**రామాయంపేట,జులై04(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షం,పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా ఉండగా,మధ్యాహ్నంనుంచి ప్రారంభమైన వర్షం సాయంత్రానికి మరింత ఉధృతమైంది.భారీ వర్షానికి రామాయంపేట పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.పాత దుర్గాబాయి ఆసుపత్రి సమీపంలోని పాత జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.నీటిలో రహదారి పరిస్థితి కనిపించక వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించారు.అదేవిధంగా సిద్దిపేట రహదారిపై ఇప్పటికే ఉన్న గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అలాగే ఐదవ వార్డులోని చింతల శేఖర్ ఉన్న వీధిలో సిసి రోడ్డు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి అలాగే విషసర్పాలు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.మున్సిపల్ పాలకవర్గానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని చింతల శేఖర్ తో పాటు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.వర్షపు నీటి పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ప్రతి వర్షానికీ ఇదే సమస్య పునరావృతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి,నీరు నిలిచే ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీనల్ల పోచమ్మ ఆలయంలో చండీ హోమం..



**మేడ్చల్,జులై 04(సూర్యరేఖ)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్--పూడూర్ డివిజన్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మశ్రీ సంజయ శర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో చండీ హోమం,ఏకాశితి కలశ స్నపనం, దాన్యాది, వాసం, ఫలాధివాసం, పుష్పాధివాసం,శయ్యాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఆదివారం బ్రాహ్మీముహూర్తంలో యంత్రస్థాపన,విగ్రహ ప్రాణప్రతిష్ఠ,పూర్ణాహుతి, సంప్రోక్షణ, మహానైవేద్యం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిటీ సభ్యులు రెడ్డంగారి నవీన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి,తొంట యాదయ్య,బీజేపీ సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీవాసులు,మహిళలు,భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## టి.యూ.వి బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఎం.డి.అలీ నియామకం..

**బెల్లంపల్లి,జులై04(సూర్యరేఖ)**



తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టి.యూ.వి)రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ ఆదేశాల మేరకు, తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఎం.డి.అలీను బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాసాడి శ్రీరాములు,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేశం చేతుల మీదుగా అలీ భాయ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం అలీ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణకు,జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేశంకు కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిజమైన ఉద్యమకారులకు అమలయ్యే వరకు నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు.

## ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల..

**జూలై 6సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాల స్వీకరణ..**

**మరిపెడ ఎంఈఓ గాదె అనితాదేవి**

**మరిపెడ,జూలై04(సూర్యరేఖ)**



మరిపెడ మండలంలో మంజూరైన ఆరు ప్రీ-ప్రైమరీ పాఠశాలల ఇన్‌స్ట్రక్టర్లు,ఆయా పోస్టుల నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో ప్రదర్శించినట్లు మండల విద్యాశాఖాధికారి గాదె అనితాదేవి శనివారం తెలిపారు.తాత్కాలిక మెరిట్ జాబితాపై అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు లేదా వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లయితే,సంబంధిత ఆధార ధ్రువపత్రాలతో కలిసి జూలై 6 సోమవారం సాయంత్రం 5 గంటలలోపు ఎంఆర్సీలోని మండల విద్యాశా ఖాధికారికి లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు.నిర్దేశించిన గడువు అనంతరం అందిన అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణన లోకి తీసుకోబోమని స్పష్టం ఆమె చేశారు.అందిన అభ్యంతరాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి విడుదల చేస్తారని తెలిపారు.

## కోర్టు నూతన భవనాన్ని పరిశీలించిన డీఎల్ఎస్ఏ చైర్మన్ నిర్మల

**మందమర్రి,జూలై04(సూర్యరేఖ)**



మందమర్రిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన కోర్టు భవనాన్ని జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ)చైర్మన్,జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నిర్మల శనివారం పరిశీలించారు.కోర్టు భవనంలోని కోర్టు హాళ్లు,కార్యాలయ గదులు,మౌలిక వసతులను పరిశీలించిన ఆమె ప్రారంభోత్సవానికి ముందు పూర్తి చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. న్యాయవాదులు,వ్యాజ్యదారులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని,భవనం ప్రారంభా నికి అవసరమైన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.న్యాయ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా అన్ని అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్యతో పాటు సీనియర్ న్యాయవాదులు సందని,సుంకర భుజంగరావు,మేకల రాజన్న, ఆర్.ఆర్.రాములు,సత్తన్న,మధుకర్,శేఖర్, ఆంజనేయులు ,సదయ్య, రమణ, కిన్నెర్ల శ్రీనివాస్, రంజిత్ గౌడ్,కట్ల శ్రీనివాస్,అయిల్లా లక్ష్మణ్ తదితరులు,మందమర్రి మండలానికి చెందిన న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ విధులకు ఆటంకం--వ్యక్తికి 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్



**చెన్నూర్,జులై 04(సూర్యరేఖ)** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భీమారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగించిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా,అతనికి14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు భీమారం ఎస్ఐఎ.రాజేందర్ తెలిపారు.ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం డయల్-100కు వచ్చిన ఫిర్యాదు మేరకు బ్లూ కోల్ట్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఇంట్లో గొడవ జరుగుతోందని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన పోలీసు సిబ్బందిపై బోయవాడకు చెందిన చొప్పరి శేఖర్ మద్యం మత్తులో దుర్భాషలాడడమే కాకుండా దాడికి ప్రయత్నించి, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు పోలీసులు తెలిపారు.పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి చెన్నూరు కోర్టులో హాజరుపరచగా,కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ సందర్భంగా ఎస్ఐ ఎ.రాజేందర్ మాట్లాడుతూ...ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# వ్యవసాయ రంగం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది..

**ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి..**

**శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.డి.రాజిరెడ్డి**






**రాజేంద్రనగర్,జులై04(సూర్యరేఖ)** వ్యవసాయ రంగం ప్రస్తుతం వాతావరణ మార్పులు,నీటి కొరత,పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.డి.రాజిరెడ్డి అన్నారు.ఐసీఏఆర్--వ్యవసాయ సాంకేతిక అనువర్తన పరిశోధనా సంస్థ (ఏటిఏఆర్ఐ),జోన్-ఎక్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2026--27సంవత్సరానికి సంబంధించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక కార్యశాల రాజేంద్రనగర్ లోని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కళాశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు,వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల అధికారులు,ఐసీఏఆర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.డి.రాజి రెడ్డి మాట్లాడుతూ...ఈ పరిస్థితుల్లో రైతుల అవసరాలను గుర్తించి,ప్రాంతానుకూల సాంకేతికతలను కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వేగంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.రైతుల ఆదాయాన్ని పెంచే విలువ ఆధారిత వ్యవసాయం, ఉద్యాన పంటల వైవిధ్యీకరణ,ప్రకృతి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా.సి.తారా సత్యవతి మాట్లాడుతూ...వాతావరణ మార్పులను తట్టుకునే చిరుధాన్యాల సాగును విస్తరించడంతో పాటు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులు,పోషకాహార భద్రత,మహిళా సాధికారతకు దోహదపడే కార్యక్రమాలను కృషి విజ్ఞాన కేంద్రాలు చేపట్టాలని సూచించారు.పరిశోధన ఫలితాలను రైతులకు సులభంగా అందించడం ద్వారానే వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ఐసీఏఆర్--అటారి,జోన్-- ఎక్స్ డైరెక్టర్ డా. షేక్ ఎన్. మీరా మాట్లాడుతూ...ప్రతి కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ఆధారాలతో వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు.ఆన్ ఫార్మ్ ట్రయల్స్, ఫ్రంట్‌లైన్ డెమాన్‌స్ట్రేషన్లు,రైతు శిక్షణలు,యువత మరియు మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా విస్తరించాలని పేర్కొన్నారు.ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూ విస్తరణ విద్యా సంచాలకులు డా.టి.సురేష్ కుమార్ మాట్లాడుతూ...ఉద్యాన పంటల్లో ఆధునిక ఉత్పత్తి సాంకేతికతలు,సమగ్ర పోషక నిర్వహణ,సూక్ష్మ నీటిపారుదల,పంట అనంతర నిర్వహణ వంటి అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.పీజేటీఎస్ఏయూ విస్తరణ విద్యా సంచాలకులు డా.ఎం.యాకాద్రి మాట్లాడుతూ...వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐసీఏఆర్ సంస్థలు,కృషి విజ్ఞాన కేంద్రాల మధ్య సమన్వయం పెరిగితే పరిశోధన ఫలితాలు వేగంగా రైతులకు చేరుతాయని,ప్రతి కార్యక్రమం రైతు సమస్యల పరిష్కారానికి దోహదపడేలా ఉండాలని అన్నారు.పీవీఎన్ఆర్‌టీవీయూ విస్తరణ విద్యా సంచాలకులు డా.ఎం.కిషన్ కుమార్ మాట్లాడుతూ... పంటలు--పశుసంవర్ధకాన్ని సమీకృతంగా చేపట్టడం ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని, పశుసంవర్ధక రంగంలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు.

# దక్షిణాది ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలి..

**10--15 ఏళ్ల కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలి..**

**కొత్త బొగ్గు బ్లాక్ల సాధన,కోల్ గ్యాసిఫికేషన్‌పై దృష్టి పెట్టాలి..**

**కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**






**మందమర్రి,జూలై04(సూర్యరేఖ)** దక్షిణ భారతదేశ ఇంధన భద్రతలో సింగరేణి కాలరీస్ కంపెనీ కీలక పాత్ర పోషించాలని,రానున్న 10 నుంచి 15 సంవత్సరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సంస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర బొగ్గు,గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు.శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి పనితీరు,భవిష్యత్ కార్యాచరణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ...బొగ్గు ఉత్పత్తి,రవాణా,ఓవర్‌బర్డెన్ తొలగింపు,కొత్త గనుల అభివృద్ధి,అనుమతుల పురోగతి వంటి అంశాలను గనుల వారీగా సమీక్షించారు.దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి పనితీరును మెరుగుపర్చాలని సూచించారు. కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించే రానున్న గనుల వేలంలో సింగరేణి చురుకుగా పాల్గొని కొత్త బొగ్గు బ్లాక్లను సాధించాలని ఆదేశించారు.ప్రభుత్వ రంగ సంస్థలు పోటీ పరిస్థితుల్లో నిలదొక్కుకోవాలంటే నాణ్యత,సామర్థ్యం,ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కోల్ గ్యాసిఫికేషన్‌పై దృష్టి దేశంలో కోల్ గ్యాసిఫికేషన్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న మంత్రి, దక్షిణ భారతదేశంలోని ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా సింగరేణి ఈ రంగంలో అడుగుపెట్టాలని సూచించారు.ప్రారంభ దశలో చిన్న స్థాయిలో అయినా కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టును చేపట్టి, ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంత అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని అన్నారు.ఎల్‌నినో ప్రభావానికి ముందస్తు సన్నద్ధతఎల్‌నినో ప్రభావంతో దేశంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సింగరేణి,కోల్ ఇండియా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

**ఉద్యోగులే సంస్థ బలం..**

సింగరేణి అభివృద్ధికి ఉద్యోగులే ప్రధాన బలమని పేర్కొన్న మంత్రి,సంస్థ భవిష్యత్ ప్రణాళికల్లో ఉద్యోగులను భాగస్వాములను చేయాలని సూచించారు.ప్రతి ఉద్యోగి సంస్థ విజయాన్ని తన విజయంగా భావించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి సంస్థ ప్రస్తుత పరిస్థితులు,బొగ్గు ఉత్పత్తి, రవాణా,కొత్త ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్,సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సి, సింగరేణి డైరెక్టర్లు,ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గగన్ పహాడ్ లో విద్యుత్ సరఫరాల అంతరాయం..



**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)** గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్‌లో డిటిఆర్ ఏర్పాటు నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.హర్షవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 11:00గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు గగన్‌పహాడ్ లీడర్ పరిధిలో గల ప్రాంతాలైన గ్రీన్ సిటీ,జల్ పల్లి,శివాజీ నగర్లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## మైలార్ దేవ్ పల్లి డివిజన్ సమస్యలు పరిష్కరించాలి..

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన టిడిపి నాయకుడు విజయ్ కుమార్



**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాలనీలలోని ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుపుతూ టిడిపి నాయకుడు విజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో ప్రధానంగా డైనేజీలు పొంగిపొర్లుతున్నాయి,రోడ్లపై చెత్త పేరుకుపోవడం,చెరువుల్లో కలుషిత నీరు మురుగునీరు చేరడం,రోడ్లు దెబ్బతినడం,పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం వంటి సమస్యలు ప్రజల దైనందిన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని కలెక్టర్ కు వివరించారు.ఇందిరమ్మ క్యాంటీన్ వద్ద భోజనం చేసే పేదలు,కార్మికులకు ఎండ,వర్షం నుంచి రక్షణ కల్పించే విధంగా షెడ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించిన ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులను అదేశించి తక్షణం శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోందని,వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరారు.

## బానోత్ అమ్మ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ పరామర్శ..



**మరిపెడ,జూలై04(సూర్యరేఖ)** మరిపెడ మండలం దంట్లకుంట తండ గ్రామపంచాయతీకి చెందిన బానోత్ అమ్మ (70) అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.బానోత్ అమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు కాలు నాయక్,పాండు, చోక్లా,బాలాజీ,వెంకన్న, వస్రం తదితరులుఉన్నారు.

## 9వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం..

ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా గృహ ప్రవేశం..



**నారాయణఖేడ్,జులై04(సూర్యరేఖ)**నారాయణఖేడ్ పట్టణంలోని 9వ వార్డు సభ్యులు సాయిలుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే డా.పట్లోళ్ల సంజీవ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. .పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని,ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో స్థానిక కౌన్సిలర్ బాణాపురం రాజు ముదిరాజ్,ఇతర కౌన్సిలర్లు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన గౌతమ్ కుమార్



**శేరిలింగంపల్లి,జులై04(సూర్యరేఖ)**శేరిలింగంపల్లి నియోజకవర్గం,చందానగర్ లోని గంగారం ప్రభుత్వ పాఠశాలను బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ గౌతమ్ కుమార్ సందర్శించి పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్,మధ్యాహ్న భోజనం సరిగా అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.భోధనా విధానాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ఈ క్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎస్ భీమమ్మ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సుభాష్ గౌతమ్ కుమార్ ను గౌరవప్రదంగా శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ...పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన వాతావరణం కనిపిస్తున్నదని,ప్రభుత్వ పాఠశాలలో సహజమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలో చదివితే భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎస్. భీమమ్మ,ప్రధానోపాధ్యాయులు ఎం.సుభాష్ , ఉపాధ్యాయులు ఎంపీ విజయలక్ష్మి,టీ.ప్రీతి,సీ. కృష్ణవేణి,ఝాన్సీ రాణి,రాధిక,పరిగి మండల మాజీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

## దేశంలో జ్యుడీషియల్ సంస్కరణలు అత్యవసరం..

మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి



**మంచిర్యాల,జూలై 04(సూర్యరేఖ)** దేశంలో న్యాయవ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు జ్యుడీషియల్ సంస్కరణలు అత్యవసరమని రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన నేషనల్ లీగల్ ఎన్‌క్లేవ్--2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రజలకు వేగవం తమైన, పారదర్శకమైన,అందుబాటులో ఉండే న్యాయాన్ని అందించేం దుకు న్యాయవ్యవస్థలో సమయానుకూల మార్పులు అవసరమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి న్యాయ నిపుణులు, న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు,ఇండియన్ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని రాజ్యాంగ పరిరక్షణ,జ్యుడీషియల్ సంస్కరణలు,ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్, లా విద్యార్థి మొహమ్మద్ ఇలియాజుద్దీన్,మందమర్రి మండల జనరల్ సెక్రటరీ బియ్యాని రవికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల పేరుతో ప్రైవేట్ పాఠశాలపై దాడి చేస్తే సహించం...

ట్రస్మా హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ గాలయ్య



**నాంపల్లి,హైదరాబాద్,జూలై04(సూర్యరేఖ)** ప్రైవేట్ పాఠశాలపై విద్యార్థి సంఘాల పేరుతోదాడి చేస్తే సహించం అని జియాగూడ విఘేశ్వర ఉన్నత పాఠశాల కరస్పాండెంట్,తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మెనేజ్మెంట్ అసోసియెషన్ (ట్రస్మా) హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీరప్పగారి గాలయ్య హెచ్చరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ...విద్యార్థి సంఘాల పేరుతో ప్రైవేట్ పాఠశాలలపై దాడులు చేస్తూ,పాఠశాల ప్రాంగణాన్ని భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ సహించేది లేదని అన్నారు.విద్యార్థి సంఘం పేరు చెప్పుకొని కొన్ని చోట్ల కొంతమంది పాఠశాలకు వచ్చి విద్యార్థులను, ఉపాధ్యాయులను,సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేయడం జరుగుగుతోందని మండిపడ్డారు.విద్యార్థి సంఘాల సమావేశాల పేరుతో డబ్బులు అడగడం,అసభ్య పదజాలంతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం మాకు సహకరిస్తే మంచి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడం జరుగుతుంది సూచించారు.


## నూతన జూనియర్ ఇన్‌స్పెక్టర్‌కు ఐఎన్‌టీయూసీ ఘన సన్మానం..



**మందమర్రి,జూలై04(సూర్యరేఖ)** మందమర్రి ఏరియాలోని ఎస్ అండ్ పీసీ విభాగానికి నూతనంగా జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన బోయిన ఓదెలును ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య ఆధ్వర్యంలో,ముఖ్యఅతిథిగా హాజరైన ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు స్వీట్లు తినిపించి ఆత్మీయంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా దేవి భూమయ్య, కాంపెల్లి సమ్మయ్య,లు మాట్లాడుతూ...బోయిన ఓదెలు గతంలో అందించిన సేవలను కొనియాడారు. ఏరియాలో కూడా తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్మికులకు,శాఖకు మరిన్ని విశిష్ట సేవలు అందించి అందరి ప్రశంసలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ జాయింట్ సెక్రటరీ కె.జగన్నాథ్ చారి, ఫిట్ సెక్రటరీ కె.ఆర్.సంపత్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చంద్రగిరి మురళి,జమేదార్ దశరథం,ఫిట్ కమిటీ సభ్యులు,ఎస్ అండ్ పీసీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్కరి ఓటు రద్దు కాకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరగాలి..

గున్నాల రంగారెడ్డి



**నాంపల్లి,హైదరాబాద్,జూలై 04(సూర్యరేఖ)** అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించకుండా బీఎల్ఏలు,బీఎల్ డీలు ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియ ను సజావుగా నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా గున్నాల రంగారెడ్డి మాట్లాడుతూ..ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎన్ఏ,బీఎల్ఎలు భాగస్వాములై ఓటర్లకు సహకరించాలని సూచించారు.అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలని,ఎమ్యూమరేషన్ పత్రాల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులు పర్యవే క్షించి ఓటర్లకు సహకరిస్తూ వారి ఓట్లు రద్దు కాకుండా చూడాలని కోరారు.ప్రజలు గందరగోళానికి గురికాకుండా ప్రతిఒక్కరూ కొద్ది సమయాన్ని కేటాయించి సరైన సమాచారం ఇచ్చి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని గున్నాల రంగారెడ్డి సూచించారు.

## జై శ్రీరామ్..జై జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం..

భక్తిశ్రద్ధలతో శనివారం సాయంత్రం హారతి..

గొంద్రాల ప్రసాద్-జ్యోతి దంపతులు సమర్పించిన సీతమ్మవారి ఆశీర్వాద చీర లక్కీడ్రాలో భక్తురాలు కాయితోజు రజితకు అందజేత..



**మరిపెడ,జూలై04 (సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన హారతి కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది.జై శ్రీరామ్..జైజై శ్రీరామ్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీసీతారామచంద్ర స్వామి,ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక హారతులు సమర్పించి దివ్య ఆశీర్వాదాలు పొందారు.ఆలయ అర్చకులు సుదర్శన్ బట్టార్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు,హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందారు.శనివారం హారతి కార్యక్రమంలో భాగంగా గొంద్రాల ప్రసాద్-జ్యోతి దంపతులు సమర్పించిన సీతమ్మవారి ఆశీర్వాద చీరను లక్కీడ్రా ద్వారా ఎంపికైన భక్తురాలు కాయితోజు రజితకు ఆలయ అర్చకులు,దేవస్థాన కమిటీ సభ్యులు అందజేశారు.ఈ సందర్భంగా దాతల కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అలాగే భక్తులకు పంపిణీ చేసే పులిహోర ప్రసాదం కోసం ధాన్యలక్ష్మి రైస్ మిల్ యాజమాన్యం దారం నాగేశ్వరరావు-వసంతలక్ష్మి దంపతులు ఒక కేజీ పులిహోర ప్రసాదానికి దాతలుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.ఈ వారం పులిహోర ప్రసాదానికి గుడిపాటి సత్యనారాయణ-జానకలక్ష్మి దంపతులు,శనిగల ప్రసాదానికి కొంపెల్లి సురేందర్ రెడ్డి-శృతి దంపతులు దాతలుగా ముందుకు వచ్చారు.దాతల కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రత్యేకంగా ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు,దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ..ప్రతి శనివారం సాయంత్రం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించే హారతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ నామస్మరణలో పాల్గొని శ్రీ సీతారామచంద్ర స్వామి,శ్రీఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.సీతారామాంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రతి భక్తునిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,మాజీ ఉపసర్పంచ్ గంట్ల రంగారెడ్డి,కమిటీ కోశాధికారి ఉల్లి శ్రీనివాసరావు, బోడ రూప్ల,గర్రెపెల్లి జానకిరామయ్య,రాంబాబు,గర్రెపెల్లి నర్సయ్య, వోబిలిశెట్టి వేణు, బూరుగు దిలీప్,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టవిరుద్ధంగా జర్నలిస్టుల అరెస్ట్..

తెలంగాణ జర్నలిస్టులను ఆంధ్రపోలీసులు లాక్కునిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుంది..?

అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలి:

రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి



**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)**రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పాలనలో ప్రజలకు, సమాజంలో నాలుగవ స్తంభమైన జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం జర్నలిస్ట్ కేవీరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.ఆంధ్రపోలీసులు తెలంగాణకు వచ్చి ఇక్కడి జర్నలిస్టులను లాక్కునిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందని, వెంకట్రామిరెడ్డిని చిత్రహింసలకు గురిచేస్తే,ఎన్ కౌంటర్ చేస్తే దిక్కెవరని ప్రశ్నించారు.కేవీరెడ్డి సతీమణి విజయలక్ష్మీపై దాడి చేసిన ఆంధ్ర పోలీసులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో తెలంగాణ ప్రజలు నిర్భయంగా ఉండేవారని,ఇవాళ కాంగ్రెస్ ఏలుబడిలో ఆందోళన నెలకొందని అన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ పాలన ప్రతిసారీ ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తున్నదని మండిపడ్డారు.జర్నలిస్టులను రాష్ట్ర డీజీపీ నేరస్తుల్లా చూడటం దురదృష్టకరమని వాపోయారు.అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.మీడియా,డిజిటల్ మీడియాపై ఇలాంటి అణచివేత ఇప్పుడు తెలంగాణలో తమరి సహచరుడు రేవంత్ పాలనకు నిదర్శనంగా మారింది!'అని విమర్శించారు.ఆడబిడ్డ విజయలక్ష్మీకి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# మధుబన్ కాలనీ నుండి ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కాలనీకి అప్రోచ్ రోడ్డు లేదు..

అక్రమ మార్గంగా అప్రోచ్ రోడ్డును రాకపోకలు సాగిస్తున్నారని జోనల్ కమిషనర్ కు కాలనీ అసోసియేషన్ ఫిర్యాదు..

టౌన్ ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో విచారించమని జోనల్ కమిషనర్ ఆదేశాలు..

అప్రోచ్ రోడ్డుతో భారీ వాహనాలు రాక పోకలు ప్రమాదాలతో మరణాలు: కాలనీ అసోసియేషన్ ఆవేదన..








**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ మధుబన్ కాలనీ,ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ కాలనీల మధ్య అప్రోచ్ రోడ్డు లేదని అక్రమంగా కాలనీలోకి రోడ్డును ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.మధుబన్ కాలనీ హుడా అనుమతి పొందిన లేఅవుట్ అని ఈ లే అవుట్ కు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి ఎలాంటి అప్రోచ్ రోడ్డు లేదని జోనల్ కమిషనర్ కు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు తమ స్వలాభం కోసం ఒక ప్లాటు యజమానిని ఒప్పించి ప్రత్యామ్నాయంగా మరొక ప్లాటు కాలనీలో ఇచ్చి ప్లాట్లు రోడ్డుగా చూపిస్తున్నారని జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీకి మా కాలనీ ద్వారా అప్రోచ్ రోడ్డు (అనుసంధానం)ను ఏర్పాటు చేయటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని,దీంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని వివరించారు.కొన్ని నెలల క్రితం ఒక భారీ వాహనం ఢీకొట్టడం వల్ల చిన్న బాలుడు ప్రాణాలు కోల్పోయాడని గుర్తు చేశారు.ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ ప్లాట్లు రెసిడెన్షియల్ గా ఉన్నప్పటికీ భారీ షెడ్లు నిర్మించి కమర్షియల్ ప్లాట్లుగా మార్చారని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. షెడ్లు నిర్మించటం వల్ల వ్యాపార కార్యకలాపాల కోసం భారీ వాహనాలు తమ కాలనీ గుండా రాకపోకలు సాగిస్తున్నారని,దీంతో కాలనీవాసులు ప్రమాదాల బారిన పడుతున్నారని గుర్తు చేశారు.మధుబన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ నుండి రాకపోకలు సాగించకుండా పెద్ద బండరాలను అడ్డంగా ఏర్పాటు చేశామని తెలియజేశారు.అందుకు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో ఈ విషయంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.భారీ వాహనాల నుండి తమకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని,దీంతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరారు.

# పేదల గడపగడపకు మిషన్ వాక్..
# నేడు డాక్టర్ బాదావత్ రవి గ్రామ సేవాయాత్ర

సింగరేణి మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు..పక్షవాతం,బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల పరామర్శ..

అమర జవాన్ కుటుంబానికి సంఘీభావం




**కారేపల్లి జూలై 04(సూర్యరేఖ)** దేశ,విదేశాల్లో పునరావాస వైద్య సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందిన కారేపల్లి మండలం కొత్తండ గ్రామానికి చెందిన మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి స్వగ్రామ ప్రాంత ప్రజలకు సేవలందించేందుకు ఆదివారం సింగరేణి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సేవా యాత్ర చేపట్టనున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పక్షవాతం,హార్ట్ స్ట్రోక్,బ్రెయిన్ స్ట్రోక్,వికలాంగులు తదితర నాడీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేద ప్రజలను వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడంతో పాటు అవసరమైన వైద్య సూచనలు, పునరావాసంపై అవగాహన కల్పించనున్నారు.అవసరమైతే మెరుగైన చికిత్స అందేలా మార్గదర్శనం చేయనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.పర్యటనలో భాగంగా ఉదయం 8నుంచి 10గంటల వరకు బొక్కల తండా, విశ్వనాథపల్లిలో హట్కార్ రాంబాబుతో కలిసి బాధితులను పరామర్శించనున్నారు.అనంతరం భిక్య తండాలో రాంకీతో కలిసి పర్యటిస్తారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సూర్య తండాలో పర్యటించి,దేశ రక్షణలో అమరుడైన సైనికుడు అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘీభావం తెలియజేయనున్నారు.విదేశాల్లో సంపాదించిన అనుభవాన్ని స్వస్థల ప్రజల ఆరోగ్యానికి వినియోగించాలనే సంకల్పంతో డాక్టర్ బాదావత్ రవి ప్రతి ఆదివారం గ్రామాల్లో పర్యటిస్తూ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని,పేదలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయడమే మిషన్ వాక్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సేవా కార్యక్రమంలో స్థానిక ప్రజలు, శ్రేయోభిలాషులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గురుకుల ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్..

జూలై 6న తొర్రూరులో నిర్వహణ..అర్హులైన విద్యార్థులు హాజరు కావాలి..

మరిపెడ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శిరుమల్ల శ్రీనివాసులు

**మరిపెడ,జూలై04(సూర్యరేఖ)** మరిపెడ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల,కళాశాలలో 2026--27విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ,బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం జిల్లా స్థాయి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శిరుమల్ల శ్రీనివాసులు తెలిపారు.స్పాట్ కౌన్సెలింగ్ ఈ నెల 6వ తేదీ ఉదయం 10గంటలకు తొర్రూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు,వాటి జిరాక్స్ ప్రతులు,పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.2026లో ఎస్ఎస్‌సీ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులని,సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అనర్హులని స్పష్టం చేశారు. పేద,ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గురుకుల విద్య ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ శిరుమల్ల శ్రీనివాసులు కోరారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి:

తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్యకు కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ నివాళులు

**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)** తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య తొలి అమరుడని మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. శనివారం హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం జంట నగరాల అధ్యక్షులు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా దొడ్డి కొమరయ్య వర్ధంతి వేడుకలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ...నిజాం పాలనలో రైతులు అనుభవించిన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు.తెలంగాణ స్వయంపాలన ఆకాంక్షలకు ఊపిరిలూదిన సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని అన్నారు.తన మరణంలో ప్రజా చైతన్యానికి నాంది పలికిన మహనీయుడు దొడ్డి కొమరయ్య అని ఆయన పేర్కొన్నారు.దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడని కొనియాడారు.ఆయన త్యాగం,ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.సమాజంలో సమానత్వం,సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.దొరల దురహంకారంపై తిరుగబడి ప్రాణాలు అర్పించిన కొమరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.కురుమలు ఐకమత్యంతో మెలగాలని ఆకాంక్షించారు.దొడ్డి కొమరయ్య ఆశయ



సాధనకు,ఆయన అడుగుజాడల్లో నడవాలి అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని,ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఆయన చూపిన ధైర్యం,త్యాగం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యువత దొడ్డి కొమురయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీను,ఉప్పల్ ఆనంద్,రామస్వామి, శంకర్,రాజకుమార్,రవి,మూర్తి,రఘు,జిరాజ్ కుమార,బొడ్రాయి శివసాయి, మొగ్గి భాగ్యమ్మ,రిషిశివ,మురళి,కిష్టమ్మ,శరణమ్మ,లక్ష్మ,హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం సభ్యులు పాల్గొన్నారు

# గ్రామాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ కృషితో గ్రామాల అభివృద్ధి..

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు..

గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు ఎమ్మెల్యే చొరవతో శాశ్వత పరిష్కారం..

కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు

బురహాన్‌పురం-ఊకల్ రహదారికి రూ.30 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**మరిపెడ,జూలై 04(సూర్యరేఖ)** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బురహాన్‌పురం గ్రామం నుంచి ఊకల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై రూ.30లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఐలమల్లు మాట్లాడుతూ...గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ చొరవతో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా ప్రభుత్వం నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు,డ్రైనేజీలు,తాగునీటి సౌకర్యాలు,ఇతర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి,సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి



రైతాంగానికి అండగా నిలిచిందన్నారు.బురహాన్‌పురం,ఊకల్ రహదారిపై నిర్మించనున్న సీసీ రోడ్డు పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మచ్చా వెంకటరామ నరసయ్య,నల్లు శ్రీకాంత్ రెడ్డి,కొన్నే సోమన్న,గ్రామ సర్పంచ్ గుగ్గిల వెంకటమ్మ వెంకన్న,ఉప సర్పంచ్ పెద్దబోయిన సురేష్,మొక్కల వెంకన్న,మొక్కల లక్ష్మయ్య,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ నరేష్ నాయక్,గ్రామ నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలు,గ్రామ పెద్దలు,యువకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం..

రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్

**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)** సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ అన్నారు .పెరుగుతున్న డిజిటల్ మోసాల ముప్పును ఎదుర్కొనేందుకు,రాజేంద్రనగర్ జోన్ పోలీసులు శనివారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టీజీఐఆర్డీ)లో ఒక సమగ్ర సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.అవగాహన కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌టి నుండి రాష్ట్ర వనరుల ప్రతినిధులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపిడిఓలు), వ్యవసాయ నిపుణులతో సహా 520 మంది కీలక సామాజిక సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ...సాధారణ నేరాలతో పోల్చితే సైబర్ నేరాల సంఖ్య,వాటి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతుందన్నారు.సెల్ల వినియోగంలో అప్రమత్తంగా లేకుంటే సైబర్ నేరగాళ్లు ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాలోని నగదు లాగేసుకుంటారన్నారు.మోసపూరిత లోన్ యాప్ లను నమ్మి మోసపోవద్దన్నారు.సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు.ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేయాలన్నారు.ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి యాప్‌లు,మోసపూరిత



పార్ట్-టైమ్ ఉద్యోగ ఆఫర్లు,విధ్వంసకరమైన" డిజిటల్ అరెస్ట్"నకిలీ స్కామ్‌ల ప్రమాదాలను ప్రముఖంగా ప్రస్తావించారు.అనుమానాస్పద లింకులు, సందేశాలను నమ్మకూడదని,ప్రైవసీ సెట్టింగ్స్‌ను సరిగ్గా వినియోగించుకోవాలని తెలిపారు.అనంతరం సైబర్ నేరాల నివారణపై అవగాహన ప్రతిజ్ఞ చేయించి ,అవగాహన పోస్టర్‌ను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్,రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.ముత్తుయాదవ్,రాజేంద్రనగర్ జోనల్ సైబర్ సెల్ ఎస్ఐ ఎస్.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో మరిపెడ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి..

మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి

కూన్య తండా కొప్పర్ల బోడుపై వెలసిన వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు..



**మరిపెడ,జూలై 04(సూర్యరేఖ)** శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో మరిపెడ పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ,ప్రజల ందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు .మరిపెడ పట్టణంలోని కూన్యతండా కొప్పర్ల బోడుపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ..పట్టణ ప్రజల సంక్షేమం,శాంతి, సుభిక్షం కోసం స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు.ప్రజల ఆశీర్వాదాలతో మరిపెడ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.ప్రతి కుటుంబంలో ఆనందం,ఐశ్వర్యం వెల్లివిరియాలని, యువతకు మంచి భవిష్యత్, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీలా లచ్చిరామ్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అలువాల ఉపేందర్ ప్రజాపతి,గంధసిరి భిక్షపతి, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టవిరుద్ధంగా జర్నలిస్టుల అరెస్ట్..

తెలంగాణ జర్నలిస్టులను ఆంధ్రపోలీసులు లాక్కునిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుంది..?

అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలి:

రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి



**రాజేంద్రనగర్,జూలై04(సూర్యరేఖ)**రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పాలనలో ప్రజలకు,సమాజంలో నాలుగవ స్తంభమైన జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు.శనివారం జర్నలిస్ట్ కేవీరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు .ఆంధ్రపోలీసులు తెలంగాణకు వచ్చి ఇక్కడి జర్నలిస్టులను లాక్కునిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందని, వెంకట్రామిరెడ్డిని చిత్రహింసలకు గురిచేస్తే,ఎన్ కౌంటర్ చేస్తే దిక్కెవరని ప్రశ్నించారు.కేవీరెడ్డి సతీమణి విజయలక్ష్మీపై దాడి చేసిన ఆంధ్ర పోలీసులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో తెలంగాణ ప్రజలు నిర్భయంగా ఉండేవారని,ఇవాళ కాంగ్రెస్ ఏలుబడిలో ఆందోళన నెలకొందని అన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ పాలన ప్రతిసారీ ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తున్నదని మండిపడ్డారు. జర్నలిస్టుల ను రాష్ట్ర డీజీపీ నేరస్తుల్లా చూడటం దురదృష్టకరమని వాపోయారు.అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు.మీడియా,డిజిటల్ మీడియాపై ఇలాంటి అణచివేత ఇప్పుడు తెలంగాణలో తమరి సహచరుడు రేవంత్ పాలనకు నిదర్శనంగా మారింది!'అని విమర్శించారు.ఆడబిడ్డ విజయలక్ష్మీకి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## పబ్బతి అంజనేయ స్వామి ఆలయంలో సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు

**నాగర్ కర్నూలు :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం నాగర్కర్నూల్ జిల్లా ఉరుకొండపేట శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఉరుకొండపేట గ్రామంలో కోలాహలం నెలకొంది. రాజకీయ ప్రస్థానంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి మరిచిపోలేని అనుభూతితో గ్రామంలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రి కి ఆత్మీయులు, ఆనాటి పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆనాటి సహచరులతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమావేశంలో అలనాటి తోటి సహచరులను అప్యాయంగా పలకరిస్తూ ఒక్కొక్కరితో కరచాలనం చేస్తూ వారి బాగోగులు అడుగుతూ ముఖ్యమంత్రి గారు గత అనుభవనాలను నెమరువేసుకున్నారు. కొందరు 20 ఏళ్ల కిందట దిగిన ఫోటోలను చూపిస్తూ పాత అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, , ఎంపీలు మల్లు రవి, , వేం నరేందర్ రెడ్డి, , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆర్థిక వ్యవహారాల్లో అపార అనుభవం కలిగిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజాసేవలు, రాజకీయ జీవితం, పరిపాలనా

# రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ధ్యేయం





## నార్సింగి,మణికొండలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జులై04(సూర్యరేఖ):** రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పని చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజక వర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలా దృష్టి సారించడం జరుగుతుందని వెల్లడించారు .నియోజకవర్గం పరిధిలోని నార్సింగి,మణికొండ పరిధిలో రూ.2.95 కోట్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.అందులో భాగంగా నార్సింగి సర్కిల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన పలు కమ్యూనిటీ హాళ్లు,అంగన్వాడీ భవనాల ప్రారంభం చేశారు.నార్సింగి కమ్యూనిటీ హాల్ ను వార్డు నెంబర్ 124 పరిధిలో రూ.200 లక్షల భారీ వ్యయంతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్,వార్డు నెంబర్ 127 మణికొండ పరిధిలోని పుప్పాలగూడ గ్రామం,నెమలి నగర్ లో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, వార్డు నెంబర్ 127 పరిధిలోని నెమలినగర్ లోనే రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాలను ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాటి పరిష్కారానికి చొరవ చూపడం జరుగుతుందని వివరించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతిని ధులు ,అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు వద్దు.. ఆస్తి ముద్దు..!

**కల్లపరి గ్రామంలో వృద్ధ దంపతుల ఆవేదన**

**ఆస్తిపై కన్నేసి తోబుట్టువులను బయటికి పంపించాలనుకుంటున్న పెద్ద కుమారుడు..**

**న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు**



**కోడుమూరు :** కోడుమూరు మండలం కల్లపరి గ్రామంలో ఆస్తి వివాదం ఓ కుటుంబంలో తీవ్ర కలహాలకు దారితీసింది. జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిని పెద్ద కుమారుడు తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, తమతో పాటు మిగతా ఇద్దరు కుమారులను ఇంటి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని వృద్ధ దంపతులు ఆరోపిస్తూ అధికారులను ఆశ్రయించారు.బాధితులు పడిగ పేతురయ్య (74), దీవెనమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులు చేస్తూ పిల్లలందరికీ వివాహాలు జరిపించిన అనంతరం, 1995 జూలై 24న కల్లపరి గ్రామానికి చెందిన జాన్ మార్క్ వద్ద నుంచి సర్వే నంబర్ 629లో 2.5 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో ఆర్థిక స్థోమత లేకపోవడంతో పూర్తి రిజిస్ట్రేషన్ చేయించకుండా అగ్రిమెంట్ రూపంలో వీలునామా తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఆ స్థలంలో తమ ముగ్గురు కుమారులకు ఒక్కొక్కరికి ఒక్కో ఇల్లు నిర్మించి ఇచ్చామని, ప్రస్తుతం వారు ఇంటి పన్ను, నీటి పన్నులు కూడా చెల్లిస్తూ నివాసం ఉంటున్నారని తెలిపారు.కుటుంబ బాధ్యతలను పెద్ద కుమారుడు పడిగ ఇమ్మానియేల్‌కు అప్పగించగా, తమ పేరిట ఉన్న వీలునామా పత్రాన్ని దొంగిలించి 2015 జూలై 3న జాన్ మార్క్ ద్వారా తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. విషయం గురించి ప్రశ్నించగా, "ఈ స్థలం పూర్తిగా నాదే.. అందరూ ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలి" అంటూ బెదిరిస్తూ, నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై శనివారం కోడుమూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. నమ్మకద్రోహానికి పాల్పడిన తమ పెద్ద కుమారుడు పడిగా ఇమ్మానియేల్ పై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు మరియు ఇద్దరు కుమారులకు న్యాయం చేయాలని వృద్ధ దంపతులు కోరారు.

# హిందువులారా జాగోరే సర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోంది

**కరీంనగర్ :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందిఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదంఅధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదు,మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది.కష్టపడి పనిచేసి క్షేత్రస్థాయి నుండి ఎదిగే లీడర్ ను సమాజం గౌరవిస్తుంది20 ఏళ్ల రేవంత్ రాజకీయ జీవితానికి శుభాకాంక్షలు.6 గ్యారంటీలను అమలు చేయాలని కోరుతున్నా.అప్పులు, అవినీతి, అక్రమాలు తప్ప చేసిందేమీ లేదుకేంద్ర నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు చేసింది శూన్యం.రెండు పార్టీలు కలిసి రూ.10 లక్షల అప్పు చేసి జనంపై భారం మోపారుతెలంగాణను శ్రీలంక, పాకిస్తాన్ లా మార్చే ప్రమాదంగ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం 14, 15 ఆర్థిక సంఘం నిధులిస్తే జీతాలిస్తూ డైవర్ట్ చేస్తున్నారు.అప్పుల ఊబి నుండి బయటకు రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందేవీబీజీ రామ్ జీ పథకంతో పనిదినాలు పెంచి ఆస్తులు సృష్టించడం తప్పా,దీనిపై కోర్టుకు వెళ్లడం ఏందిమోదీకి మంచి పేరొస్తే ఓర్వలేరా?కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫైర్:వేములవాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రిరాష్ట్ర ప్రభుత్వం "సర్" ను ఉపయోగించుకుని హిందువల ఓట్లను తొలగించేందుకు పెద్ద ఎత్తున కుట్ర చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. సర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు సహకరించడం లేదన్నారు. ఫలితంగా అధికారులు క్షేత్రస్థాయిలో హిందువుల ఇండ్లకు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదన్నారు. తెలంగాణలోని హిందువులంతా జాగ్రుతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వేములవాడ నియోజకవర్గంలో మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. అందులో భాగంగా కాచారం గ్రామంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. మరో 10లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దమ్మన్నపేట గ్రామంలో 8 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రేవంత్ కు శుభాకాంక్షలు.కష్టపడి పనిచేసి క్షేత్రస్థాయి నుండి ఎదిగే లీడర్ ను సమాజం గౌరవిస్తుంది అందులో భాగంగా 20 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు. కేసీఆర్ కూడా కష్టపడి పైకొచ్చిన నాయకులే. కానీ ప్రజలకిచ్చిన 6




గ్యారంటీలను అమలు చేయాలని కోరుతున్నా.

## బండి భగీరథ్ కు బెయిల్ వద్దు

**హైదరాబాద్ :** బండి సాయి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ పోలీసులు హైకోర్టును కోరారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోక్సో కేసులో ఈ మేరకు పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పోలీసులు తమ అఫిడవిట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు.పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్ జులై 3న దాఖలు చేసిన కౌంటర్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్, ఆమెను లోబర్చుకుని 2025 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీరామ్ గార్డెన్స్, నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటనలు జరిగినట్లు తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న భగీరథ్, తాను నిర్దోషినని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తూ రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది.

## కార్ల పేరుతో భారీ మోసం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి మోసం వెలుగుచూసింది. సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారంలో అధిక లాభాలు చేకూరుస్తామని నమ్మించి, ఓ దంపతులు పలువురి నుంచి సుమారు రూ.1.58 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. కార్స్24 (అంఖీ24) ప్రతినిధులుగా చలామణి అవుతూ ఈ ఘరానా మోసానికి తెరలేపిన నిందితులపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు కేసు నమోదు చేశారు.బాధితుల్లో ఒకరైన రయీస్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఉదంతం బయటపడింది. నిందితుడైన వాజిద్ అహ్మద్ ఖాన్ తనకు వ్యక్తిగతంగా పరిచయమని, గత నవంబర్‌లో తనను సంప్రదించాడని రయీస్ తెలిపారు. కార్స్24 సంస్థ ద్వారా పాత కార్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని అధిక లాభాలకు విక్రయించవచ్చని, అయితే తన వద్ద సరిపడా పెట్టుబడి లేదని వాజిద్ నమ్మబలికాడు.పెట్టుబడికి పూర్తి భద్రతతో పాటు ఆకర్షణీయమైన లాభాలు వస్తాయని వాజిద్ ఇచ్చిన హామీని నమ్మిన రయీస్, సుమారు రూ.58 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఈ మొత్తాన్ని వాజిద్‌తో పాటు అతని భార్యకు చెందిన బ్యాంకు ఖాతాలకు వివిధ విడతల్లో బదిలీ చేసినట్లు రయీస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.రయీస్‌తో పాటు అతని స్నేహితులు, ఇతర పరిచయస్తుల నుంచి కూడా నిందితులు ఇదే పద్ధతిలో భారీగా పెట్టుబడులు సేకరించారు. బాధితులందరి నుంచి వసూలు చేసిన మొత్తం రూ.1.58 కోట్లు దాటినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## న్యాయ్ కోసం సుప్రీం?కు వెళ్తా

**హైదరాబాద్ :** ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జూబ్లీహిల్స్ ఆస్తుల వేలానికి సంబంధించి... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ఆమోదిస్తూ తీర్పు వెలువరించింది న్యాయస్థానం. బ్యాంక్ సర్ఫేసి చట్టం – 2002 కింద చేపట్టిన ఆస్తి వేలాన్ని సమర్థించింది. దీనిపై ట్విట్టర్ వేదికగా బండ్ల గణేష్ రియాక్ట్ అయ్యారు.బ్యాంక్ వాళ్లు తన ఆస్తిని అన్యాయంగా విక్రయించారని ఆరోపించారు బండ్ల గణేష్. 'అన్యాయంగా, లోపాయికారీ ఒప్పందంతో మార్కెట్ వాల్యూ కంటే చాలా తక్కువ ధరకే బ్యాంక్ అధికారులు నా ఆస్తిని సేల్ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ 2022లో నేను కోర్టును ఆశ్రయించా. ఈ కేసులో కింది డీఆర్‌టీ (ఆఖీ)లో నాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే, తాజాగా హైకోర్టులో నాకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది.అయినప్పటికీ నాకు భారత న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించి, నిజాయతీగా నా హక్కుల ఆధారంగా న్యాయం సాధిస్తాననే అచంచలమైన విశ్వాసం నాకు ఉంది.' అంటూ రాసుకొచ్చారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లోన్ రికవరీలో భాగంగా బండ్ల గణేశ్, ఆయన ఫ్యామిలీకి చెందిన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని స్థిరాస్తిని విక్రయించింది. వేలం ద్వారా వచ్చిన సొమ్మును ఆస్తి యజమానులకు చెల్లించాలంటూ రుణ వసూళ్ల ట్రైబ్యునల్ (ఆఖీ) ఆర్డర్స్ ఇష్యూ చేసింది. వీటిని సవాల్ చేస్తూ... యూనియన్ బ్యాంక్ హైకోర్టులో పిటిషన్ ఫైల్ చేసింది. 2019లో ఆస్తిని స్వాధీనం చేసుకుని... 2022లో వేలం నిర్వహించగా రూ.8.51 కోట్లు వచ్చిందిన కోర్టుకు తెలిపింది బ్యాంక్.డీఆర్‌టీ ఉత్తర్వుల్లో లోపాలున్నాయని... రుణ గ్రహీత కంపెనీకి సంబంధించి దివాళా ప్రక్రియ ప్రారంభమైనంత మాత్రాన వ్యక్తిగత గ్యారెంటర్ల ఆస్తులపై మారటోరియం వర్తించదని బ్యాంక్ తరఫు లాయర్ వాదించారు. వేలాన్ని సవాల్ చేయడంతో పాటు బ్యాంక్‌పై వేసిన ఇతర పిటిషన్లను ఉప సంహరించుకోవడానికి బండ్ల గణేశ్ అంగీకరించారన్నారు. అదేదీ చేయకుండానే ఆయన డీఆర్‌టీని ఆశ్రయించారని... ట్రిబ్యునల్ బ్యాంక్ రికార్డులను పరిశీలించకుండా వేలాన్ని రద్దు చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం... ఆస్తి వేలం సబబేనని తీర్పు ఇచ్చింది

## తెలంగాణ త్వరలో దివాళా

**కరీంనగర్జులై :** తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు.రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## ట్రిపుల్ ఐటీలో విషాదం..

## ఆరో అంతస్తు నుంచి

## దూకి విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ :** హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రతిష్ఠాత్మక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విషాదం చోటుచేసుకుంది. శనివారం ఓ భవనం ఆరో అంతస్తు నుంచి దూకి 20 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని ఖమ్మం జిల్లాకు చెందిన అభిరూప్‌గా పోలీసులు గుర్తించారు.శనివారం క్యాంపస్‌లోని ఓ భవనంపై నుంచి కిందకు దూకడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న క్యాంపస్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మహబూబ్‌నగర్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి చెందిన అభిరూప్ ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతను గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఒకవైపు చదువు ఒత్తిడి, మరోవైపు అనారోగ్య సమస్యలు తోడవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆరో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై అభిరూప్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713